# హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...

epaper.hyderabadpulsenews.in



విలేకరులు కావలెను

హైదరాబాద్ పల్స్

"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాడ్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్

- Dr. RAHUL KUMAR 9989834020
- K. Naveen Kumar 94406 53413

www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad



సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 176 | పేజీలు : 08 | శనివారం | 04-07-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.


# నేడు మిడ్జిల్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన



, హైదరాబాద్

20 ఏళ్ల రాజకీయ జీవితానికి పురుడు పోసిన గడ్డపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అడుగుపెడుతున్నారు. జడ్పీటీసీగా మొదలై, నేడు రాష్ట్ర రథసారథిగా ఎదిగిన సీఎం రేవంత్ తనను ఆదరించిన ప్రజలకు, నడిపించిన నేలకు నమస్కరించేందుకు వస్తున్నారు. తొలుత నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఊర్కొండ పబ్బతి ఆంజనేయ స్వామిని దర్శించుకోనున్న ముఖ్యమంత్రి, తొలి ప్రయాణంలో తన వెంట నడిచిన నేతలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నారు. అనంతరం మహబూబ్‌నగర్ జిల్లాలోని మిడ్జిల్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన అనంతరం భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. సీఎం రేవంత్ రెడ్డికి, మిడ్జిల్ వాసులకు భావోద్వేగ పూరితమైన వేడుకగా ఈ యాత్ర నిలవనుంది.

జడ్పీటీసీగా రాజకీయ ప్రస్థానం మొదలు : నాయకులెవ్వరికైనా తన రాజకీయ ప్రయాణం ప్రారంభమైన ప్రాంతంతో అవినాభావ సంబంధం ఉంటుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మహబూబ్?నగర్ జిల్లాలోని మిడ్జిల్ అటువంటి ప్రత్యేక ప్రాంతం. జడ్పీటీసీగా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన రేవంత్ రెడ్డికి మిడ్జిల్ తొలి విజయాన్ని అందించింది. 2006లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగిన ముఖ్యమంత్రి కాంగ్రెస్ మినహా అన్ని పార్టీల మద్దతుతో జయకేతనం ఎగురవేశారు. అనంతరం 9 నెలలకే స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. తర్వాత కొడంగల్ ఎమ్మెల్యే, మల్కాజిగిరి ఎంపీగా గెలిచిన రేవంత్ రెడ్డి, 2023లో తిరిగి కొడంగల్ నుంచి ఎన్నికై ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించారు. మండల స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదిగిన ముఖ్యమంత్రి, తన 20 ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని పురస్కరించుకొని మిడ్జిల్?కు వస్తున్నారు.

రూ.10 కోట్లతో అభివృద్ధి పనులు : మిడ్జిల్ పర్యటనలో భాగంగా తాను తొలిసారి నామినేషన్ పత్రాలు పెట్టి పూజించిన ఊర్కొండపేట ఆంజనేయ స్వామిని దర్శించుకోనున్నారు. అనంతరం అక్కడే రూ.10 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం తొలి రాజకీయ ప్రయాణంలో వెంట నడిచిన అనుచరులు, ముఖ్య నేతలు, పెద్దలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నారు. వారితో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన అనంతరం మహబూబ్?నగర్ జిల్లా మిడ్జిల్?కు రానున్నారు. వెల్జాల ఎక్స్ రోడ్ వద్ద రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్? అంబేద్కర్, స్థానిక సీనియర్ నేత ద్యాప గోపాల్ రెడ్డి విగ్రహాలను ఆవిష్కరించనున్నారు. అనంతరం సమీపంలోని బహిరంగ సభా స్థలంలో పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేయనున్నారు. తదనంతరం బహిరంగ సభలో ప్రసంగించనున్న రేవంత్ రెడ్డి, ప్రజా ప్రతినిధిగా రాజకీయాల్లోకి పంపిన ప్రజలకు సీఎంగా తన కృతజ్ఞత తెలపనున్నారు.

# బీఆర్ఎస్ అప్పులు 8.21 లక్షల కోట్లు కాదా?..



తెలంగాణ అప్పులపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఈసారి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఘాటు ఆరోపణలు చేశారు. బీఆర్ఎస్ హయాంలో భారీ అప్పులు చేశారని అన్నారు. అప్పులపై కేసీఆర్, హరీశ్ రావు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.మాజీ మంత్రి హరీశ్ రావు తెలంగాణ ఆర్థిక పరిస్థితిపై పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని భట్టి మండిపడ్డారు. సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న అప్పులు, ఆర్థిక వ్యవహారాలపై వివరాలు వెల్లడించారు. తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకే కేటీఆర్, హరీశ్ రావు ఎదురుదాడి చేస్తున్నారని విమర్శించారు.బీఆర్ఎస్ పాలనలో మొత్తం రూ.8.21 లక్షల కోట్ల అప్పులు చేసినట్లు భట్టి తెలిపారు. ఇందులో చెల్లించకుండా వదిలేసిన బకాయిలు కూడా ఉన్నాయని చెప్పారు. పదేళ్ల పాలన అబద్ధాల పునాదులపై సాగిందని విమర్శించారు. ఈ భారీ అప్పులపై మాజీ సీఎం కేసీఆర్ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.గత ప్రభుత్వ అప్పుల కారణంగా రెండున్నరేళ్లలో అసలు, వడ్డీలు కలిపి రూ.2,08,061 కోట్లు చెల్లించాల్సి వచ్చిందని భట్టి చెప్పారు. అయినప్పటికీ సంక్షేమ పథకాలను ఆపలేదన్నారు. అధిక వడ్డీ అప్పులను రీస్ట్రక్చరింగ్ చేయడం వల్ల వార్షిక వడ్డీ భారం రూ.34 వేల కోట్ల నుంచి రూ.11 వేల కోట్లకు తగ్గిందని వివరించారు.బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో సింగరేణిని సంక్షోభంలోకి నెట్టిందని భట్టి ఆరోపించారు. కొత్త కోల్ బ్లాకులు తీసుకురాలేదని విమర్శించారు. బొగ్గు మాయం ఆరోపణలపై ఇప్పటికే సింగరేణి విజిలెన్స్ విచారణకు ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. కొత్త కోల్ బ్లాకుల కోసం కేంద్రంతో చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు.

# ప్రధాని మోదీకి 'చిన్న చెల్లెలు' వచ్చింది!

భారత్, జపాన్ దేశాల మధ్య వ్యూహాత్మక సంబంధాలు నూతన శిఖరాలకు చేరుతున్నాయి. కేవలం అధికారిక చర్చలకే పరిమితం కాకుండా, ఇరు దేశాల అధినేతల మధ్య నెలకొన్న బలమైన వ్యక్తిగత అనుబంధానికి నిదర్శనంగా నిలిచి ఒక అరుదైన సన్నివేశం న్యూఢిల్లీలో ఆవిష్కృతమైంది. జపాన్ ప్రధానమంత్రి సనాయ్ తకాయిచిని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎంతో ఆత్మీయంగా తన 'చెల్లెలు' అని సంబోధించారు.న్యూఢిల్లీ వేదికగా జరిగిన 16వ భారత్–జపాన్ వార్షిక శిఖరాగ్ర సదస్సు సందర్భంగా ఈ ఆసక్తికర సంభాషణ చోటుచేసుకుంది. హైదరాబాద్ హౌస్‌లో నిర్వహించిన సమావేశంలో, దివంగత మాజీ ప్రధాని షింజో అబేను తాను సొంత అన్నయ్యలా భావించేదాన్నని తకాయిచి గుర్తుచేసుకున్నారు. అబేకు ప్రధాని మోదీ అత్యంత సన్నిహితులు కావడంతో, తనూ ఆయనను అదే దృష్టితో చూస్తున్నానని ఆమె పేర్కొన్నారు. దీనికి స్పందించిన మోదీ, ఆమెను 'చిన్న చెల్లెలు' అని సంబోధించారు. ఈ అనుబంధంతోనే ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళతామని ఇరు నేతలు ఆకాంక్షించారు.జపాన్ తొలి మహిళా ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తకాయిచి భారత్‌లో జరిపిన తొలి అధికారిక పర్యటన ఇది. ఈ పర్యటనలో భాగంగా ఇరు దేశాల మధ్య చరిత్రాత్మక ఒప్పందాలు కుదిరాయి. ముఖ్యంగా రక్షణ రంగంలో సంయుక్త అభివృద్ధి కోసం తొలిసారిగా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆర్థిక, ఇంధన భద్రతపై ఒక స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను ఆవిష్కరించడంతో పాటు, రానున్న పదేళ్లలో జపాన్ నుంచి 10 ట్రిలియన్ యెన్ల పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా నిర్దేశించుకున్నారు.ఈ సదస్సు ఇరు దేశాల మధ్య నెలకొన్న ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యంలో ఒక నూతన అధ్యాయానికి నాంది అని ప్రధాని మోదీ అభివర్ణించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సెమీకండక్టర్లు, ఇంధన రంగాల్లో పరస్పర సహకారంపై ఇరువురు నేతలు సుదీర్ఘంగా చర్చించారు. స్వేచ్ఛాయుతమైన, నియమ నిబంధనలతో కూడిన ఇండో–పసిఫిక్ ప్రాంతం కోసం కలిసి పనిచేయాలని ఇరు దేశాల అధినేతలు నిర్ణయించారు.



# లెక్కలు తప్పైతే రాజీనామా చేస్తా..

## మీరు బీఆర్ఎస్ పార్టీని రద్దు చేస్తారా?: జూపల్లి



తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న అప్పులపై అధికార కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ నేతల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. "తెలంగాణ అప్పులపై చర్చకు నేను సిద్ధం. సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌కు సాయంత్రం 5 గంటలకు వస్తా. మరి బీఆర్ఎస్ నేతలు సిద్ధమేనా?" అంటూ రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సవాల్ విసిరారు. "ఖబడ్దార్ కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు. పాలమూరు పౌరుషమా, కల్వకుంట్ల పౌరుషమా తేల్చుకుందాం రండి" అని ధ్వజమెత్తారు. తన లెక్కలు తప్పు అయితే మంత్రి, ఎమ్మెల్యే పదవులకు తక్షణమే రాజీనామా చేస్తానని, మరి వారి లెక్కలు తప్పైతే రాజీనామా చేస్తారా? బీఆర్ఎస్ పార్టీని రద్దు చేస్తారా? అని ఛాలెంజ్ చేశారు. కేసీఆర్ రాకపోతే జూపల్లి చెప్పే లెక్కలు నిజమేనని మీడియా ముందు ఒప్పుకోవాలని అన్నారు.అసెంబ్లీలో రాష్ట్ర అప్పులపై కేటీఆర్, హరీశ్‌రావు ఒక్కొక్కరు ఒక్కో రకమైన అబద్ధపు లెక్కలు చెప్పారని జూపల్లి విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం దిగిపోయే నాటికి రాష్ట్రంపై ఏకంగా రూ.8,21,651 కోట్ల అప్పుల భారం మోపారని ఆయన మండిపడ్డారు. కార్పొరేషన్ల ద్వారా దొంగచాటుగా తెచ్చిన అప్పులను వీరు ఎందుకు దాస్తున్నారని ప్రశ్నించారు.తాను ఆత్మగౌరవం కోసం ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి, వ్యాపారాలు చేసుకుని రాజకీయాల్లోకి వచ్చానని.. పారిపోయే లక్షణం తనకు లేదని, అబద్ధాలు చెప్పే అలవాటు అంతకన్నా లేదని స్పష్టం చేశారు.

# రఘునాథపురం శ్రీ తారకరామ పవర్లూమ్ సంఘం సొసైటీ ఎన్నికలు....

### అధ్యక్షుడిగా గాడిపెల్లి శ్రవణ్ కుమార్ ఏకగ్రీవం ...



హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలం రఘునాథపురం గ్రామంలో శ్రీతారకరామ పవర్ లూమ్స్ వివర్స్ కో–ఆపరేటివ్ అండ్ సేల్స్ సొసైటీ , ఎన్నికలు శు క్రవారం రోజున ఎన్నికల అధికారి యాదగిరి నిర్వహించారు, అధ్యక్షులుగా గాడిపెల్లి శ్రవణ్ కుమార్, ఉపాధ్యక్షులుగా భోగ వెంకటేశం, కార్యదర్శిగా పొట్టబత్తిని మల్లికార్జున్, కోశాధికారిగా భోగ పాండురంగం లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు, డైరెక్టర్లుగా లోక శ్రీశైలం, గాడిపెల్లి లావణ్య, బల్ల విజయలక్ష్మి, పొట్టబత్తిని వెంకటలక్ష్మి, పొట్టబత్తిని రవిలు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి యాదగిరి తెలిపారు, ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు గాడి పెల్లి శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన సభ్యులందరికీ పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# పురందేశ్వరి కీలక బాధ్యతలు, బండికి ప్రమోషన్- సమూల ప్రక్షాళన..కొత్త టీం సిద్ధం..!!



హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 03, సెంట్రల్ డెస్క్ : ప్రధాని మోదీ కీలక నిర్ణయాలకు సిద్దమయ్యారు. మోదీ 4.0 లో భాగంగా ప్రభుత్వం.. పార్టీలో సమూల ప్రక్షాళన దిశగా కసరత్తు చేస్తున్నారు. ఈ నెల 20 నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం లోగా నిర్ణయాలు అమలు చేసేందుకు సమాయత్తం అవుతున్నారు. అందులో భాగంగా యువతకు ప్రాధాన్యత ఇవ్వాలని డిసైడ్ అయ్యారు. తెలుగు రాష్ట్రాల నుంచి బీజేపీ నేతలకు కొత్త బాధ్యతలు దక్కే అవకాశం కనిపిస్తోంది. పార్టీ– మంత్రివర్గంలో తెలుగు రాష్ట్రాలకు ప్రాధాన్యత దక్కే విధంగా కసరత్తు కొనసాగుతోంది.బీజేపీ కొత్త జాతీయ కార్యవర్గం ఏర్పాటు పై కీలక మంత్రాంగం కొనసాగుతోంది. తాజాగా పార్టీ చీఫ్ నితిన్ నబీన్.. తాజాగా అమిత్ షా నివాసంలో సుమారు మూడు గంటల పాటు సమావేశం అయ్యారు. ఈ సమావేశానికి బీజేపీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) బీఎల్ సంతోష్ కూడా హాజరయ్యారు. పార్టీ సంస్థాగత వ్యవహారాల్లో కీలక పాత్ర పోషిస్తున్న ఈ ముగ్గురు నేతల మధ్య జరిగిన చర్చల్లో కొత్త కేంద్ర బృందం రూపకల్పనతో పాటు భవిష్యత్ రాజకీయ వ్యూహాలపై కూడా సమగ్రంగా చర్చించినట్లు సమాచారం.నితిన్ నబిన్ నేతృత్వంలోని కొత్ టీంలో అనుభవజ్ఞులైన సీనియర్ నేతలతో పాటు యువ నాయకులకు కూడా ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వంలో వివిధ పదవుల్లో ఉన్న కొందరు నేతలను సంస్థాగత బాధ్యతల కోసం తిరిగి పార్టీలోకి తీసుకువచ్చే అవకాశాలపైనా సమావేశంలో చర్చ జరిగినట్లు తెలుస్తోంది.

తెలుగు రాష్ట్రాలకు ప్రాధాన్యత:

కొందరు మంత్రులకు జాతీయ స్థాయిలో కీలక బాధ్యతలు అప్పగించే అంశం పైనా ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. అదే విధంగా పార్టీ పార్లమెంటరీ బోర్డు, కేంద్ర ఎన్నికల కమిటీ, జాతీయ కౌన్సిల్ లోనూ కీలక మార్పులు జరగనున్నాయి. కీలక పదవుల్లో దక్షిణాది రాష్ట్రాలకు ప్రాధాన్యత దక్కనుంది. తెలంగాణ నుంచి కిషన్ రెడ్డి, బండి సంజయ్ ప్రస్తుతం కేంద్ర మంత్రులుగా ఉన్నారు. తెలంగాణ నుంచి మరొకరికి కేంద్ర కేబినెట్ లో అవకాశం కల్పించటం ఖాయంగా కనిపిస్తోంది.అదే సమయంలో బండి సంజయ్ –కిషన్ రెడ్డిలను మంత్రులుగా కొనసాగిస్తూనే పార్టీ బాధ్యతలు కేటాయించనున్నట్లు సమాచారం. ఇక.. ఏపీ నుంచి పురందేశ్వరికి కొత్త జాతీయ కార్య వర్గంలో కీలక బాధ్యతలు అప్పగించనున్నట్లు తెలుస్తోంది. కర్ణాటక నుంచి విజయేంద్ర, తమిళ నాడు నుంచి మురుగన్, కేరళ నుంచి రాజీవ్ చంద్రశేఖర్ లకు జాతీయ టీంలో కొత్త బాధ్యతలు అప్పగించేందుకు రంగం సిద్దం చేస్తున్నారు. కొత్త కార్యవర్గం పై వచ్చే వారం అధికారిక ప్రకటన చేసే అవకాశం కనిపిస్తోంది.

# మందులు వాడేటప్పుడు ఈ 3 తప్పులు చేయొద్దు..



ఇంటర్నెట్ డెస్క్: మందులు తీసుకునేటప్పుడు చేసే చిన్న చిన్న పొరపాట్లు కూడా ఆరోగ్యంపై పెద్ద ప్రభావం చూపవచ్చు. అనారోగ్యం తగ్గించడానికి మందులు ఎంత ముఖ్యమో, వాటిని సరైన విధంగా తీసుకోవడం కూడా అంతే ముఖ్యం. కానీ చాలామంది తెలియక కొన్ని తప్పులు చేస్తుంటారు. ఇవి వ్యాధిని మరింత పెంచే ప్రమాదం కలిగిస్తాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

**డాక్టర్ సలహా లేకుండా మందులు వాడటం**

జ్వరం, దగ్గు, జలుబు వచ్చినప్పుడు చాలామంది స్వయంగా మెడికల్ షాపులో మందులు కొనుగోలు చేసి వాడేస్తుంటారు. ముఖ్యంగా పిల్లలకు ఇలా చేయడం ప్రమాదకరం. దీనివల్ల శరీరంపై దుష్ప్రభావాలు కలగవచ్చు.

**మందుల కోర్సు మధ్యలోనే ఆపేయడం**

కొంతమందికి ఆరోగ్యం కొద్దిగా మెరుగుపడగానే యాంటీబయాటిక్ మందులు ఆపేస్తారు. దీంతో ఇన్ఫెక్షన్ పూర్తిగా తగ్గకుండా మళ్లీ తీవ్రమయ్యే అవకాశం ఉంటుంది.

**సమయానికి మందులు తీసుకోకపోవడం**

కొంతమంది మందులు ఖాళీ కడుపుతో తీసుకుంటారు లేదా డాక్టర్ చెప్పిన సమయానికి కాకుండా ఆలస్యంగా వాడుతారు. అలాగే గడువు ముగిసిన మందులు వాడటం కూడా ప్రమాదకరం.

**అధికంగా వాడటం ప్రమాదకరం**

పెయిన్‌కిల్లర్స్‌ను ఎక్కువగా వాడటం వల్ల మూత్రపిండాలు, కాలేయంపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. దీర్ఘకాలంలో కిడ్నీ, లివర్ సమస్యలు వచ్చే ప్రమాదం పెరుగుతుందని హెచ్చరిస్తున్నారు.

**జెనరిక్, బ్రాండెడ్ మందుల మధ్య తేడా**

జెనరిక్, బ్రాండెడ్ మందుల్లో ఉండే ఔషధ పదార్థం ఒకటే. వీటి మధ్య తేడా ప్రధానంగా కంపెనీ పేరు, ధరలో మాత్రమే ఉంటుంది. డాక్టర్ సూచనల మేరకు సరైన విధంగా వాడితే జెనరిక్ మందులు కూడా బ్రాండెడ్ మందుల్లాగే ప్రభావవంతంగా పనిచేస్తాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

# ప్రెగ్నెన్సీలో ఒత్తిడి.. పుట్టబోయే బిడ్డపై ప్రభావం చూపుతుందా?




ఇంటర్నెట్ డెస్క్: గర్భధారణ సమయంలో చిన్న చిన్న విషయాలకే కోపం రావడం, ఎక్కువగా ఒత్తిడికి గురవడం చాలా మంది మహిళల్లో కనిపించే సాధారణ సమస్య. ఈ సమయంలో శరీరంలో హార్మోన్ల మార్పులు వేగంగా జరుగుతాయి. వాటి ప్రభావంతో భావోద్వేగాల్లో మార్పులు, ఆందోళన, చిరాకు వంటి సమస్యలు రావచ్చు.అయితే గర్భధారణ సమయంలో దీర్ఘకాలంగా ఒత్తిడికి గురికావడం తల్లి ఆరోగ్యంతో పాటు పుట్టబోయే బిడ్డ అభివృద్ధిపైనా ప్రభావం చూపే అవకాశం ఉందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా తల్లి శరీరంలో ఒత్తిడికి సంబంధించిన హార్మోన్ల స్థాయులు పెరిగితే, అది శిశువు మెదడు అభివృద్ధిపై ప్రభావం చూపవచ్చని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి.

**ప్రభావం ఎలా ఉంటుంది?**

ఆరోగ్య నిపుణులు తెలిపిన సమాచారం ప్రకారం, గర్భధారణ సమయంలో తల్లి నిరంతరం ఒత్తిడికి గురైతే, అది పిల్లల భావోద్వేగ వికాసం, ప్రవర్తన, ఏకాగ్రత సామర్థ్యంపై ప్రభావం చూపే అవకాశం ఉంది. కొంతమంది పిల్లల్లో చిరాకు, ఆందోళన లేదా ఏకాగ్రత లోపం వంటి సమస్యలు కనిపించవచ్చు. అయితే ఈ ప్రభావాలు ప్రతి గర్భిణీలో ఒకేలా ఉంటాయని చెప్పలేమని, వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితులు, జీవనశైలి వంటి అంశాలపై అవి ఆధారపడి ఉంటాయని వైద్యులు పేర్కొంటున్నారు.

ఈ లక్షణాలను నిర్లక్ష్యం చేయొద్దు

ఎప్పుడూ ఆందోళన లేదా భయంతో ఉండటం.

తరచూ కోపం రావడం, చిరాకుగా అనిపించడం.

నిద్ర సరిగా లేకపోవడం.

ఎక్కువగా బాధగా లేదా ఒంటరిగా అనిపించడం.

రోజువారీ పనులపై ఆసక్తి తగ్గిపోవడం.

ఈ లక్షణాలు ఎక్కువ కాలం కొనసాగితే వైద్యులని లేదా మానసిక ఆరోగ్య నిపుణులని సంప్రదించడం మంచిది.

ఒత్తిడిని తగ్గించుకోవడానికి సూచనలు

రోజు తగినంత విశ్రాంతి తీసుకోవాలి.

కుటుంబ సభ్యులు, స్నేహితులతో మాట్లాడి మానసిక మద్దతు పొందాలి.

వైద్యుల సూచన మేరకు తేలికపాటి వ్యాయామాలు చేయాలి.

సమతుల్య ఆహారం తీసుకోవాలి.

అవసరమైతే వైద్యుల సలహా తీసుకోవాలి.

గర్భధారణ సమయంలో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యంపైనా శ్రద్ధ పెట్టడం చాలా ముఖ్యం. తల్లి ప్రశాంతంగా, ఆరోగ్యంగా ఉంటే బిడ్డ ఎదుగుదల కూడా మెరుగ్గా ఉండే అవకాశం ఉంటుంది.

# ప్రతి 10 మందిలో ఏడుగురికి ఫైబర్ లోపం.. షాకింగ్ రిపోర్ట్




ఇంటర్నెట్ డెస్క్: భారతీయులు దాదాపు 70 శాతం మంది తగినంత ఫైబర్ (పీచుపదార్థం) తీసుకోవడం లేదని తాజా అధ్యయనం వెల్లడించింది. అంటే ప్రతి 10 మందిలో సుమారు 7 మంది రోజుకు తీసుకోవాల్సిన ఫైబర్ పరిమాణాన్ని పొందడం లేదు. సోషల్ మీడియాలో ఆరోగ్య ట్రెండ్‌లు ఎక్కువగా వస్తున్నప్పటికీ, చాలా మంది ఇంకా రోజువారీ అవసరమైన ఫైబర్‌ను సరిగ్గా తీసుకోవడం లేదని ఈ పరిశోధన తెలిపింది.

**తాజా అధ్యయనం ఏమి చెబుతోంది?**

ఆశీర్వాద్ హ్యాపీ టమ్మీ విడుదల చేసిన డేటా ప్రకారం, 2021 నుంచి 2025 మధ్య దేశవ్యాప్తంగా 6.5 లక్షల మందికి పైగా ఇచ్చిన సమాధానాల ఆధారంగా 70 శాతం మంది రోజువారీ అవసరమైన ఫైబర్‌ను తీసుకోవడం లేదని తేలింది. శారీరక వ్యాయామం చేయకపోవడం, ఎక్కువ ఒత్తిడి, తక్కువ నీరు తాగడం, సరైన నిద్ర లేకపోవడం వంటి జీవనశైలి కారణాలు కూడా దీనికి కారణమని పరిశోధన చెబుతోంది.

**మహిళల్లో సమస్య ఎక్కువ**

సర్వే ప్రకారం మహిళల్లో ఫైబర్ లోపం మరింత ఎక్కువగా కనిపిస్తోంది. పురుషుల్లో సుమారు 63 శాతం మంది తగినంత ఫైబర్ తీసుకోకపోతే, మహిళల్లో ఈ సంఖ్య 73 శాతం కంటే ఎక్కువగా ఉంది. ×జవీ=--చీ×చీ సూచనల ప్రకారం, వయోజన మహిళలు రోజుకు కనీసం 25 గ్రాములు, పురుషులు 30 గ్రాముల ఫైబర్ తీసుకోవాలి. ఫైబర్ జీర్ణ వ్యవస్థకు చాలా అవసరం. ఇది పేగుల పనితీరును మెరుగుపరుస్తుంది. మలబద్ధకం వంటి సమస్యలను తగ్గిస్తుంది.

**ఆహార అలవాట్లలో లోపం**

పరిశోధన ప్రకారం చాలా మంది రోజువారీ ఆహారంలో వైవిధ్యం చూపడం లేదు. ప్రతి నలుగురిలో ఒకరు మాత్రమే రోజూ పలు రకాలు ధాన్యాలు తింటున్నారు. సుమారు 40 శాతం మంది పండ్లు చాలా తక్కువగా తింటున్నారు. కూరగాయలు తినే అలవాటు ఉన్నా, మొత్తం ఆహారంలో వైవిధ్యం తక్కువగా ఉంది.

**జీవనశైలి ప్రభావం**

సర్వేలో పాల్గొన్న వారిలో 60 శాతం మంది రోజూ శారీరక వ్యాయామం చేయడం లేదని తెలిపారు. 30 శాతం మంది మాత్రమే సరిపడా నీరు తాగుతున్నారని చెప్పారు. దాదాపు సగం మందికి నిద్ర సరిగ్గా రావడం లేదని.. ఇంకా ప్రతి ఐదుగురిలో ఒకరు ఎక్కువ ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ అన్ని కారణాలు కలిసి జీర్ణ వ్యవస్థ, మొత్తం ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు.

**నిపుణుల సూచన**

ఫైబర్ తీసుకోవడం, జీర్ణ ఆరోగ్యంపై అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని నిపుణులు అంటున్నారు. రోజువారీ ఆహారంలో పండ్లు, కూరగాయలు వంటి ఫైబర్ అధికంగా ఉన్న ఆహారాన్ని తీసుకుంటే జీర్ణ ఆరోగ్యం మెరుగవుతుందని వారు సూచిస్తున్నారు.

# కల్వేర్ పోలీస్ స్టేషన్ నూతన భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే, ఎస్పీ

**నారాయణఖేడ్ ఎమ్మెల్యే డా. పట్లోళ్ల సంజీవరెడ్డి.**

**జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్.**




హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 03, సంగారెడ్డి జిల్లా ప్రతినిధి:
సంగారెడ్డి జిల్లా, కల్వేర్ పోలీస్ స్టేషన్ నూతన భవనాన్ని ముఖ్య అతిథిగా విచ్చేసిన నారాయణఖేడ్ ఎమ్మెల్యే డా. పట్లోళ్ల సంజీవరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించడం జరిగిందని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్. తెలిపారు.
ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, జిల్లాల పునర్విభజన అనంతరం కొత్తగా ఏర్పడిన కల్వేర్ పోలీస్ స్టేషన్ తాత్కాలికంగా గ్రంథాలయ భవనంలో కొనసాగిందని, ప్రస్తుతం అన్ని సౌకర్యాలతో కూడిన నూతన భవనంలో సేవలు ప్రారంభించడం సంతోషకరమని అన్నారు. ఈ నూతన భవనం ద్వారా ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. కల్వేర్ మండల ప్రజలు తమకు ఎలాంటి సమస్యలు ఉన్నా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా పోలీస్ స్టేషన్‌ను సంప్రదించి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రజల ఫిర్యాదులను వేగంగా పరిష్కరించేందుకు జిల్లా పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు. యువత చెడు వ్యసనాలకు, ముఖ్యంగా మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. జిల్లాలో గంజాయి సాగు, మాదక ద్రవ్యాల విక్రయాలు, అక్రమ రవాణాను ఏమాత్రం సహించేది లేదని, జిల్లాలో ఎక్కడైనా గంజాయి సాగు, మాదక ద్రవ్యాల విక్రయాలు లేదా రవాణా జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే జిల్లా ఎస్-న్యాబ్ హెల్ప్‌లైన్ నంబర్ 8712656777కు సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు. అనంతరం ముఖ్య అతిథి నారాయణఖేడ్ ఎమ్మెల్యే డా. పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించడంలో మౌలిక సదుపాయాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. నూతన పోలీస్ స్టేషన్ భవనం పోలీసు సిబ్బంది విధి నిర్వహణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు దోహదపడటంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో



నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్ రెడ్డి, కంగ్టీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకట్ రెడ్డి, కల్వేర్ ఎస్ఐ రవిగౌడ్, సిర్గాపూర్ ఎస్ఐ జి. మహేష్, కంగ్టీ ఎస్ఐ దుర్గారెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు,




పోలీసు సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# హామీతో ప్రజల ఉద్యమం ఆగింది. జీఓతో ప్రజల ఆగ్రహం మళ్లీ చెలరేగుతుంది

**ప్రభుత్వం వెంటనే డంపింగ్ యార్డ్ జీఓ వెనక్కి తీసుకోవాలి**

**బీఆర్ఎస్ ఎస్టీ సెల్ కొత్తూరు మండల అధ్యక్షుడు బిచ్య నాయక్ హెచ్చరిక**

హైదరాబాద్ పల్స్, జులై 03, షాద్నగర్ :
కొత్తూరు మండలం సిద్దాపూర్ డంపింగ్ యార్డ్ వ్యవహారంలో ప్రభుత్వం జారీ చేసిన జీఓపై బీఆర్ఎస్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు బిచ్య నాయక్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా సిద్దాపూర్ గ్రామ ప్రజలు 20 రోజుల పాటు అలుపెరగని పోరాటం చేశారు. ఆ ఉద్యమం సమయంలో ఎమ్మెల్యే స్వయంగా డంపింగ్ యార్డ్ 'రాదు.. రానీయను' అని హామీ ఇవ్వడంతో ప్రజలు ఆయన మాటను విశ్వసించి ఉద్యమాన్ని విరమించారు. ఆ ఆనందంలో ప్రజలు పాలాభిషేకాలు చేసి తమ కృతజ్ఞతను చాటుకున్నారు. కానీ ఇప్పుడు ప్రభుత్వం జీఓ జారీ చేయడం ప్రజల నమ్మకాన్ని దెబ్బతీసింది. ప్రజలకు ఇచ్చిన హామీ ఏమైంది? సిద్దాపూర్ ప్రజల విశ్వాసానికి సమాధానం ఎవరు చెబుతారు? అని బిచ్య నాయక్ ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే డంపింగ్ యార్డ్ జీఓను ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజల అభిప్రాయాన్ని విస్మరిస్తే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో, సిద్దాపూర్ గ్రామ ప్రజలతో కలిసి చట్టబద్ధంగా, ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం. ప్రభుత్వం ప్రజల గళాన్ని వినక తప్పదు అని హెచ్చరించారు. సిద్దాపూర్ ప్రజల పోరాటం పదవుల




కోసం కాదు... గ్రామ భవిష్యత్తు కోసం. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడం ఇప్పుడు అధికారంలో ఉన్న వారి బాధ్యత అని బిచ్య నాయక్ పేర్కొన్నారు. ఇచ్చిన మాటలు నెరవేర్చకపోతే ఉద్యమాన్ని మరింత బలోపేతం చేసి తమ గ్రామాన్ని కాపాడుకుంటామని హెచ్చరించారు.

# అపర్ణ కుటుంబాన్ని ఆదుకున్న జిల్లా ప్రెస్ క్లబ్

**రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేత**

**కుటుంబానికి అండగా ఉంటామని భరోసా**

**జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రత్నకుమార్**

హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 04, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :
భద్రాద్రి కొత్తగూడెం: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విలేకరి అపర్ణ కుటుంబాన్ని జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రత్నకుమార్ పరామర్శించి అండగా నిలిచినారు. అపర్ణ మృతిపట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసిన ఆయన, ఆమె కుటుంబ సభ్యులను స్వయంగా పరామర్శించి రూ.10,000 జిల్లా ప్రెస్ క్లబ్ తరుపున ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రత్నకుమార్ మాట్లాడుతూ, జర్నలిస్టుల కుటుంబాలకు కష్టకాలంలో అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. అపర్ణ జర్నలిజం రంగంలో తన సేవలతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారని, ఆమె అకాల మరణం ఎంతో బాధాకరమని పేర్కొన్నారు. ఆమె కుటుంబానికి ఈ లోటు ఎప్పటికీ తీరనిదేనని, అయితే ప్రెస్ క్లబ్ తరఫున సాధ్యమైనంత సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. ఆర్థిక సహాయం అందుకున్న అపర్ణ కుటుంబ సభ్యులు జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రత్నకుమార్‌కు ప్రెస్ క్లబ్ సభ్యులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి క్లిష్ట సమయంలో తమ కుటుంబానికి అండగా నిలిచి ధైర్యం చెప్పడం ఎంతో ఊరటనిచ్చిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు మాట్లాడుతూ, సహచర పాత్రికేయుల పట్ల మానవతా దృక్పథంతో స్పందించి సహాయం అందించడం




అభినందనీయమని అన్నారు. భవిష్యత్తులో కూడా జర్నలిస్టుల సంక్షేమం కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రెస్ క్లబ్ సభ్యులు, పాత్రికేయులు, అపర్ణ కుటుంబ సభ్యులు పలువురు పాల్గొన్నారు.

# మహారాష్ట్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం. స్కూళ్ల పరిధిలో 'స్టింగ్' ఎనర్జీ డ్రింక్ విక్రయాలపై నిషేధం.!

హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 03, సెంట్రల్ డెస్క్: పాఠశాల విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మహారాష్ట్ర ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ఇటీవల దేశవ్యాప్తంగా ఉన్న మార్కెట్లో అమిత ప్రజాదరణ పొందిన 'స్టింగ్' ఎనర్జీ డ్రింక్ పిల్లలకు హానికరమని తేలింది. దీంతో ఆ ఎనర్జీ డ్రింక్ అమ్మకాలపై రాష్ట్రవ్యాప్తంగా నియంత్రణలు విధించబోతున్నట్లు ప్రకటించింది. రాష్ట్రంలోని అన్ని పాఠశాలలకు 500 మీటర్ల పరిధిలో ఈ ఎనర్జీ డ్రింక్ విక్రయాలను పూర్తిగా నిషేధించనున్నట్లు మహారాష్ట్ర ఆహార, ఔషధ పరిపాలన శాఖ మంత్రి నరహరి జిర్వాల్ అసెంబ్లీ వేదికగా వెల్లడించారు. ఈ ఎనర్జీ డ్రింక్‌లో కేఫీన్, చక్కెర శాతాలు అధికంగా ఉండటం వల్ల, దీనిని నిరంతరం వినియోగించడం చిన్న పిల్లల మానసిక, శారీరక ఆరోగ్యంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని నిపుణులు హెచ్చరించారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం ఈ చర్యలకు ఉపక్రమించింది. అసెంబ్లీలో సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ.. విద్యార్థులను ఈ తరహా డ్రింక్స్‌కు దూరంగా ఉంచేందుకు త్వరలోనే అధికారిక జీవో జారీ చేస్తామని, నిబంధనలు ఉల్లంఘించే దుకాణదారులపై కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిర్ణయంపై తల్లిదండ్రులు, విద్యావేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# అభిలాష వొకేషనల్ సెంటర్ సందర్శన

## భారతి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి




పటాన్ చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 03 :
పటాన్ చెరు నియోజకవర్గం బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లోని లేడీస్ వెల్ఫేర్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న అభిలాష వొకేషనల్ సెంటర్ ఫర్ ఇంటెలెక్చువల్ డిసేబుల్డ్ చిల్డ్రన్‌ను భారతి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి సందర్శించారు. గతంలో సేల్స్‌ఫోర్స్ సంస్థ ప్రతినిధులతో కలిసి ఈ కేంద్రాన్ని సందర్శించిన సందర్భంగా, పాఠశాల యాజమాన్యం భవనానికి పెయింటింగ్, స్లాబ్ లీకేజీ వంటి సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చింది. ఇచ్చిన హామీ మేరకు ఆ పనులను పూర్తిచేయించి, వాటిని పరిశీలించేందుకు సింధు ఆదర్శ్ రెడ్డి మరోసారి కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా స్కూల్ ట్రెజరర్ పద్మజ, ప్రిన్సిపాల్ నీలిమ సింధు ఆదర్శ్ రెడ్డి కి స్వాగతం పలికి, సహకరించిన సేల్స్‌ఫోర్స్ సంస్థ ప్రతినిధులకు మరియు అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులకు మరింత మెరుగైన వసతులు కల్పించేందుకు అవసరమైన సహకారం అందించేందుకు ఎల్లప్పుడూ కృషి చేస్తామని సింధు ఆదర్శ్ రెడ్డి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

# ప్రారంభమైన రాజగోపుర పూజలు..!

## - రేపు ప్రారంభోత్సవం..ఏర్పాట్లు పూర్తి





హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 03, జహీరాబాద్:
ఉమ్మడి మెదక్ జిల్లాలో ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న బర్దిపూర్ శ్రీ దత్తగిరి మహరాజ్ ఆశ్రమంలో నూతనంగా నిర్మించిన రాజగోపుర ప్రారంభోత్సవ పూజలు శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం సాయంత్రం విఘ్నేశ్వర ఆరాధన, పుణ్యాహవచనం, ఋత్విక్ వరణం, మృత్తికా గ్రహణం, యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన, అంకురార్పణ, జలాధివాసం తదితర పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం 7:25 గంటలకు ప్రారంభమైన యాగశాల యజ్ఞం రాత్రి 9:10 గంటల వరకు కొనసాగింది. మూడు రోజులపాటు నిర్వహించనున్న రాజగోపుర ప్రారంభోత్సవాలు ఆశ్రమ పీఠాధిపతులు అవధూతగిరి మహరాజ్, సిద్ధేశ్వరానందగిరి మహరాజ్ ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. రాజగోపుర నిర్మాణ దాత హైదరాబాద్ నిజాంపేట్‌కు చెందిన కోలన్ సునీత భద్రారెడ్డి యజ్ఞం, పూజలు నిర్వహించనున్నారు. భక్తులకు ఏర్పాట్లను ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షిస్తున్నారు. ఆలయ పరిసరాలు మంగళ వాయిద్యాలు, మంత్రోచ్చారణలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.

# కంటోన్మెంట్ నియోజక వర్గంలో నూతన వార్డు అధ్యక్షుల నియామకం

## ఎమ్మెల్యే శ్రీగణేష్ ఆధ్వర్యంలో పత్రాల అందచేత




గాంధీనగర్, జూలై 03, హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :
సికింద్రాబాద్ పరిధిలో గల కంటోన్మెంట్ నియోజకవర్గంలోని వార్డులకు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నూతనంగా వార్డు నియమితులైన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులకు ఎమ్మెల్యే శ్రీగణేష్ ఆధ్వర్యంలో వార్డు 5 గాంధీ నగర్ లో జరిగిన కార్యక్రమంలో సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దీపక్ జాన్ నియామక పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నికయిన 8 వార్డుల అధ్యక్షులు మారుతి గౌడ్, నయీమ్, మహేష్ యాదవ్, సత్యనారాయణ, పెద్దాల నర్సింహ, శ్యామ్యూల్, మురళీ ముదిరాజ్, నవీన్, మోండా అధ్యక్షుడు నాగేష్ యాదవ్ తో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చత్రీగడ్డ సర్వే నెంబర్ 1 బాధితులకు అండగా భారతీయ జనతా పార్టీ

### స్థానిక ఎమ్మెల్యే,మాజీ కార్పొరేటర్ వందల కోట్లు దండుకున్నారని ఆగ్రహం

ఓల్డ్ బోయిన్పల్లి, జూలై 03, హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :
కూకట్పల్లి నియోజక వర్గం పరిదిలోని బాలానగర్ మండలం ఓల్డ్ బోయిన్పల్లి 264 డివిజన్లో గల చత్రీగడ్డ ప్రాంతం సర్వే నెంబర్ వన్ ప్రభుత్వ భూమిని హైడ్రా స్వాదినంలోకీ తీసుకున్న విషయం విధితమే ఆ స్థలంలో స్థలాలు, ఇండ్లు కోల్పోయే పరిస్థితి వచ్చిన బాధితులకు అండగా భారతీయ జనతా పార్టీ పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ ఆదేశాల మేరకు రాష్ట్ర నాయకులు కూకట్పల్లి నియోజకవర్గ ఇన్చార్జి మాధవరం కాంతారావు ఓల్డ్ బోయినపల్లి కాంటెస్టెడ్ కార్పొరేటర్ బీజేపీ పార్టీ కార్యనిర్వహక సభ్యుడు ఏనుగుల తిరుపతి,బిజెపి పార్టీ నాయకులతో కలిసి సర్వే నెంబర్ వన్ ఛత్రిగడ్డ కు వెళ్లి సందర్శించి భరోసా ఇచ్చారు గత 15 సంవత్సరాలుగా ఇక్కడున్న పాలకులు ప్రభుత్వ స్థలాలు చెరువులు కుంటలు మొత్తం కబ్జా చేస్తూ ఒక అక్రమ సామ్రాజ్యాన్ని నిర్మించుకొని పేద ప్రజలను మోసం చేస్తూ వారి శ్రమను వారి కష్టార్జితాన్ని దోచుకొని వందల కోట్లు సంపాదించుకొని నిరుపేదలకు అన్యాయం చేస్తున్నారు. గత 15 సంవత్సరాలలో కూకట్పల్లిలో ఉన్న తొమ్మిది చెరువులు కుంటలు సర్వేనెంబర్ లో వన్ లో ఉన్న 28 ఎకరాల 28 గుంటల ప్రభుత్వ స్థలం కబ్జాకు గురైంది స్థానిక ఎమ్మెల్యే స్థానిక కార్పొరేటర్ ఈ స్థలాన్ని పేద ప్రజలకు అమ్మి రెక్కడితే కానీ డొక్కాడని నిరుపేద ప్రజలను మోసం చేసి వందల కోట్లు దండు కొని వారి ఆవేదనకు వారి ఆక్రోసానికి కారణం అవుతున్నారు. గత ప్రభుత్వం 10 సంవత్సరాలు పాలించి పేద ప్రజలను వంచించి ఏ విధంగా రాజ్యమేలు ఏందో ఇప్పుడున్న ప్రభుత్వం కూడా పేద ప్రజలను వంచిస్తూ నిజంగా హైడ్రాక్ గాని,ఈ ప్రభుత్వానికి గాని చిత్తశుద్ధి ఉంటే ఈ భూబకాసులను వారి యొక్క దళారులపై విచారణ జరిపి దళారుల ఆస్తులు జప్తు చేసి పేదలకు,ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేసారు. పేదలు కట్టుకున్న ఇళ్లను ఇబ్బంది పెట్టకుండా ఎవరైతే ఖాళీ స్థలాలకు లక్షలు పోసి కొన్న వారికి అమ్మిన దళారులను, స్థానిక నాయకులను స్థానిక కార్పొరేటర్ ను, స్థానిక ఎమ్మెల్యేను ఇందులో ప్రమేయం ఉన్నా స్థానిక కాంగ్రెస్ నాయకులను విచారణ చేసి వారిని జైలుకు పంపాలి పేదలకు వారి డబ్బును తిరిగి ఇప్పించాలి ఇక్కడ మోసపోయిన ప్రజలకు భారతీయ జనతా పార్టీ ఎప్పుడు అండగా ఉంటుదని ఇక్కడి దళారులు స్థానిక కార్పొరేటర్ అనుచరులు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని మా పేర్లు చెబితే చంపేస్తానని బెదిరిస్తున్నారని నిజంగా ఈ ప్రభుత్వానికి,హైడ్రాకు చిత్తశుద్ధి ఉంటే వీరిని వీరి దొంగల ముఠాను తప్పక శిక్షించాలి అని మాధవరం కాంతారావు డిమాండ్ చేసారు.




# అక్రమ నాటుసారాపై ఎక్సైజ్ కొరడా.. మహబూబాబాద్‌లో విస్తృత తనిఖీలు, ముగ్గురిపై కేసులు



హైదరాబాద్ పల్స్, జూలై 03, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:
మహబూబాబాద్ జిల్లాలో అక్రమ నాటుసారా తయారీ, విక్రయాలను అరికట్టేందుకు ఎక్సైజ్ శాఖ చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో కీలక విజయాన్ని సాధించింది. వరంగల్ ఎన్ఫోర్స్మెంట్ అసిస్టెంట్ కమిషనర్ కె. నవీన్ కుమార్ పర్యవేక్షణలో మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్, డీటీఎఫ్--మహబూబాబాద్, వరంగల్ ఎన్ఫోర్స్మెంట్ బృందాలు సంయుక్తంగా శుక్రవారం పలు గ్రామాలు, తండాల్లో ఆకస్మిక దాడులు నిర్వహించాయి. శనిగపురం తండా, బోడగుట్ట తండా, నడివాడ, గడ్డిగూడెం తండా, అనంతారం గ్రామాల్లో చేపట్టిన ఈ తనిఖీల్లో అక్రమ నాటుసారా తయారీకి సంబంధించిన ఆధారాలు గుర్తించారు. ముగ్గురు వ్యక్తులపై ఎక్సైజ్ చట్టం కింద కేసులు నమోదు చేసి, వారి వద్ద నుంచి 17 లీటర్ల నాటుసారా, 10 కిలోల పటికను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా నాటుసారా తయారీ కోసం నిల్వ ఉంచిన సుమారు 1,200 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. నిందితులను అనంతరం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు అధికారులు వెల్లడించారు. అక్రమ మద్యం తయారీ, విక్రయాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని, ప్రజలు కూడా ఇలాంటి కార్యకలాపాలపై సమాచారాన్ని అందించి సహకరించాలని ఎక్సైజ్ అధికారులు విజ్ఞప్తి చేశారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సీఐలు, ఎస్సైలు, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుళ్లు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# ముత్తంగి సమగ్ర అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే జిఎంఆర్

### రెండు కోట్ల 37 లక్షల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పటాన్ చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 03 :
ముత్తంగి డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని.. సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ముత్తంగి డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలలో రెండు కోట్ల 37 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు, అంతర్గత మురుగు నీటి కాలువలు, బోర్ వెల్స్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే జిఎంఆర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన రహదారులు, పారిశుద్ధ్య సౌకర్యాలు, రక్షిత మంచినీటి వసతులు కల్పించడం తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ముత్తంగి డివిజన్ ను అన్ని రంగాల్లో ఆదర్శవంతమైన డివిజన్ గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా నిరంతరం పనిచేస్తున్నామని తెలిపారు. ప్రజల అవసరాలకు ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి పనుల కోసం దశలవారీగా నిధులు కేటాయిస్తూ నిర్దేశిత గడువుగా పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసమే క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ ఉపేందర్, మాజీ జెడ్పిటిసి శ్రీకాంత్ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ ప్రభాకర్, ఆత్మ కమిటీ



మాజీ చైర్మన్ కుమార్ గౌడ్, ఇంజనీరింగ్ విభాగం డిఈ కృష్ణవేణి, ఏఈ ఫైజాన్, సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, కిట్టు, మేరాజ్ ఖాన్, సందీప్, ఆబీద్, రామకృష్ణ, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీరంగూడ గుట్ట ఆలయంలో 5,200 మొక్కలు నాటేందుకు శ్రీకారం చుట్టిన వెల్స్ ఫార్గో



పటాన్చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 03 :
పర్యావరణ పరిరక్షణలో కార్పొరేట్ సంస్థల భాగస్వామ్యం అభినందనీయం: ఆలయ చైర్మన్ సుధాకర్ యాదవ్.. పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతగా ప్రముఖ సంస్థ వెల్స్ ఫార్గో బీరంగూడ గుట్టలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయం ప్రాంగణంలో 5,200 మొక్కలు నాటేందుకు శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఆలయ పరిసర ప్రాంతాల్లో వివిధ రకాల మొక్కలను నాటారు. ఆలయ చైర్మన్ సుధాకర్ యాదవ్, కార్యనిర్వహణ అధికారి దేవనాదం సమక్షంలో సంస్థ ప్రతినిధులు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ నిబద్ధతను చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ, ఆలయ ప్రాంగణాన్ని పచ్చదనంతో నింపేందుకు 5,200 మొక్కలు నాటేందుకు ముందుకు వచ్చిన వెల్స్ ఫార్గో సంస్థకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో కార్పొరేట్ సంస్థలు భాగస్వాములు కావడం సమాజానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. దేవాలయం తరఫున నాటిన ప్రతి మొక్కను సంరక్షించి, అవి పెద్ద వృక్షాలుగా ఎదిగేలా అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రకృతిని కాపాడేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని, ఇతర సంస్థలు కూడా సామాజిక బాధ్యతలో భాగంగా పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ సభ్యులు, ఆలయ అర్చకులు, ఎండోమెంట్స్ శాఖ అధికారులు, వెల్స్ ఫార్గో సంస్థ ప్రతినిధులు, ప్రకృతి ప్రేమికులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు. ఆలయ పరిసరాలను హరితవనంగా తీర్చిదిద్దే లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని స్థానికులు అభినందించారు.



# శ్రీ గంగమ్మ తల్లి ప్రతిష్ఠా మహోత్సవానికి ఘన ఏర్పాట్లు

**లి భక్తులందరూ పాల్గొని విజయవంతం చేయాలి: శీలం శ్రీనివాస్-భాగ్యలక్ష్మి**

హైదరాబాద్ పల్స్, జూలై 03, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి :
మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ పట్టణంలో యాదవుల ఆరాధ్యదైవంగా పూజలందుకుంటున్న శ్రీ గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని జూలై 4న ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం నిర్వహించిన జలబిందెల కార్యక్రమంలో మహిళలు, యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శీలం శ్రీనివాస్ -- భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, డోర్నకల్ పట్టణంలో ఆధ్యాత్మిక సంప్రదాయాలను పరిరక్షించడంలో శ్రీ గంగమ్మ తల్లి ఆలయానికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఈ మహోత్సవం విజయవంతం కావడానికి ఆలయ కమిటీ సభ్యులు, దాతలు, భక్తులు ఎంతో కృషి చేస్తున్నారని ప్రశంసించారు. జూలై 4న జరిగే విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవానికి డోర్నకల్ పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందాలని శీలం శ్రీనివాస్--భాగ్యలక్ష్మి కోరారు. కుల, మత భేదాలకు అతీతంగా అందరూ ఈ వేడుకలో పాల్గొని ఆధ్యాత్మిక ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. అలాగే, శ్రీ గంగమ్మ తల్లి ఆలయ నిర్మాణం, విగ్రహ ప్రతిష్ఠ కోసం విరాళాలు అందించి, సేవలందించిన ప్రతి దాతకు, ప్రతి భక్తుడికి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భక్తుల సహకారం వల్లే ఆలయ నిర్మాణం సాఫీగా పూర్తై ప్రతిష్ఠా మహోత్సవం నిర్వహించే అవకాశం కలిగిందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు సామాజిక, ఆధ్యాత్మిక



కార్యక్రమాల్లోనూ ఎల్లప్పుడూ ముందుండే శీలం శ్రీనివాస్ -- భాగ్యలక్ష్మి, ప్రజల భాగస్వామ్యం తో ఇటువంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తామని తెలిపారు. భక్తులందరూ కుటుంబ సమేతంగా హాజరై శ్రీ గంగమ్మ తల్లి కృపకు పాత్రులు కావాలని మరోసారి విజ్ఞప్తి చేశారు.

# డోర్నకల్‌లో బీఆర్ఎస్‌కు యువశక్తి.. కుందోజ్ లవణ్ కుమార్ పార్టీలో చేరిక

హైదరాబాద్ పల్స్, జూలై 03, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:
డోర్నకల్ పట్టణంలో ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ యువ నాయకుడిగా ప్రత్యేక గుర్తింపు పొందిన కుందోజ్ లవణ్ కుమార్ బీఆర్ఎస్ పార్టీలో శుక్రవారం చేరారు. మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ సమక్షంలో ఉగ్గంపల్లి గ్రామంలో పార్టీ కండువా కప్పుకున్నారు. ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించాలనే సంకల్పంతో బీఆర్ఎస్‌లో చేరినట్లు లవణ్ కుమార్ తెలిపారు. డోర్నకల్ పట్టణంలో తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, విద్యుత్ వంటి ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతూ ప్రజల్లో విశ్వాసాన్ని సంపాదించుకున్న ఆయన, యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ మాట్లాడుతూ, ప్రజల కోసం పనిచేసే యువ నాయకులకు బీఆర్ఎస్‌లో సముచిత స్థానం ఉంటుందని పేర్కొన్నారు. కుందోజ్ లవణ్ కుమార్ చేరికతో డోర్నకల్ నియోజకవర్గంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని, గ్రామ స్థాయి నుంచి ప్రజల సమస్యల పరిష్కారానికి పార్టీ మరింత కృషి చేస్తుందని తెలిపారు. లవణ్ కుమార్ మాట్లాడుతూ, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తానని చెప్పారు. డోర్నకల్ అభివృద్ధి, యువత సంక్షేమం, ప్రజా సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కత్తెరసాల విద్యాసాగర్, చే రెడ్డి బిక్షం



రెడ్డి, శరత్, మంజుల చంటి, షేక్ మియా తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఓల్డ్ బోయినపల్లి డివిజనన్లో ఓటర్ ఎన్యుమరేషన్ పత్రాల పంపిణీ

### పంపిణిలో పాల్గొన్న బీజేపీ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏనుగుల తిరుపతి

ఓల్డ్ బోయిన్పల్లి, జూలై 03, హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :




ఓల్డ్ బోయినిపల్లి డివిజన్స్ పరిధిలో నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్ ) ఓటర్ ఎన్యుమరేషన్ పత్రాలను ఓల్డ్ బోయినపల్లి ప్రాంతంలో వివిధ కాలనీలలో పంపిణీ చేస్తున్న బీ.ఎల్.ఓ లతో పాటు బి.ఎల్.ఏలను కలిసి పంపిణి కార్యక్రమం మీద సమీక్ష నిర్వహించారు. ఈ ఎన్యుమరేషన్ పత్రాలు కాలనీలలో ప్రజలకు సజావుగా అందేలా చూడాలని, ప్రక్రియ విజయవంతంగా సాగాలని భారత దేశ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ ఓటరు ఎన్యుమ్యారేషన్ కార్యక్రమం అందరి సహకారంతో ముందుకు సాగాలని ఈ సందర్బంగా ఏనుగుల తిరుపతి కోరారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏనుగుల తిరుపతి, శేఖర్, రమేష్, హర్జిత్ సింగ్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డ్ జీవో 641 రద్దు చేయాలి

### ఎల్ హెచ్ పి ఎస్ అధ్యక్షుడు లక్ష్మణ్ నాయక్

**హైదరాబాద్ పల్స్, జులై 03, షాద్నగర్ :**



కొత్తూరు మండలంలోని సిద్ధాపూర్ గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన డంపింగ్ యార్డ్ ప్రతిపాదన జీవో 641 ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని ఎల్ హెచ్ పి ఎస్ షాద్నగర్ తాలూకా అధ్యక్షుడు లక్ష్మణ్ నాయక్ డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే విర్లపల్లి శంకర్ ఇక్కడ ఎలాంటి డంపింగ్ యార్డ్ రావట్లేదని చెప్పి ప్రజలని మోసం చేశారని, మరియు వాళ్ళ మనోభావాలను దెబ్బతీసే విధంగా ఈరోజు ప్రతిపాదన ఆమోదం పొందిన కూడా ఎలాంటి స్పందన లేదని ఘాటుగా విమర్శించారు. సిద్దాపూర్ తో పాటు పరిసర గ్రామాల ప్రజలు ఆరోగ్యం పట్ల మరియు పర్యావరణం, వ్యవసాయ భూముల మరియు భూగర్భ జలాల పట్ల ఆలోచించాలని లేదంటే డంపింగ్ యార్డ్ వల్ల అన్ని కలుషితమై గ్రామాన్ని మింగేస్తాయని పేర్కొన్నారు.జీవో 641 ను వెంటనే ప్రభుత్వ వెనక్కి తీసుకోవాలని లేని పక్షంలో పార్టీలకతీతంగా చుట్టుపక్కల గ్రామాల ప్రజలతో మమేకమై ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి డంపింగ్ యార్డ్ ప్రతిపాదనను తరిమికొడతామని స్పష్టం చేశారు.

## నిరుపేద బాలికకు వైద్య ఖర్చులకు ఆర్థికసాయం



హైదరాబాద్ పల్స్ న్యూస్, జులై 03, భద్రాద్రి జిల్లా ప్రతినిధి : బూర్గంపహాడ్ మండలం సారపాక గ్రామానికి చెందిన ముస్లిం ఎంపవర్మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ (మేవా) వెల్ఫేర్ సొసైటీ. ఆధ్వర్యంలో బూర్గంపహాడ్ మండలం సారపాక గ్రామపంచాయతీ రాజీవ్ నగర్ కు చెందిన షేక్. ఆయేషా పర్వీన్ (9) వైద్య ఖర్చులకోసం 10000 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించడం జరిగింది. కొంత కాలం క్రితం ఇంట్లో ఆడుకుంటూ కిందపడి కాలు విరగగా ఆపరేషన్ చేయాల్సి వస్తుందని ఆపరేషన్ కు లక్ష యాభై వేల రూపాయలు దాకా ఖర్చు అవుతుందని తెలుసుకున్న మేవా వెల్ఫేర్ కమిటీ సభ్యులు వారి కుటుంబ సభ్యులను ఓదార్చి రూ. 10000 వేల రూపాయలు ఆర్థిక సహాయంను అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ కూలి పని మీద ఆధారపడినటువంటి నిరుపేద కుటుంబం అయినటువంటి ఆయేషా పర్వీన్ కుటుంబనికి వైద్య ఖర్చులు భారంగా మారాయి. విషయం తెలుసుకున్న మేవా కమిటీ సభ్యుల తీర్మానం మేరకు మావంతు చిన్న ఆర్థిక సహాయం చేశామని ఆమె త్వరగా కోలుకోవాలని ఆ అల్లా సుభానుతాలను వేడుకుంటున్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో మేవా కమిటీ అధ్యక్షులు మహమ్మద్. ముస్తఫా. మొహమ్మద్ సోహెల్ పాషా. రెహమాన్. యూసుఫ్. మహమ్మద్ అజీజ్. అబ్దుల్ సలీం. తదితరులు పాల్గొన్నారు.

## అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను సాధించాలి

### ఆరోగ్య పర్యవేక్షకులు క్షేత్రస్థాయిలో మరింత సమర్థవంతంగా పనిచేయాలి

### జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. తుకారాం రాథోడ్





**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 03, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఆరోగ్య పర్యవేక్షకుల సమీక్ష సమావేశాన్ని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. తుకారాం రాథోడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలలో నిర్దేశించిన లక్ష్యాలను ప్రతి ఆరోగ్య పర్యవేక్షకుడు తప్పనిసరిగా సాధించాలని, గ్రామాలు, వార్డుల స్థాయిలో ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందేలా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా, వైరల్ జ్వరాలు, విరేచనాలు వంటి సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, యాంటీ లార్వల్ కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలని, ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, గ్రామపంచాయతీలు ఇతర శాఖలతో సమన్వయం చేసుకొని పారిశుద్ధ్య కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేయాలని ఆదేశించారు.జ్వరాల సర్వేలు, ఇంటింటి సందర్శనలు, వ్యాధుల పర్యవేక్షణ, అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్ కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలని తెలిపారు. రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ వంటి వ్యాధులను ముందుగానే గుర్తించి చికిత్స అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి గర్భిణీని ప్రారంభ దశలోనే నమోదు చేసి అన్ని ఏఎన్‌సీ సేవలు అందించాలని, అధిక ప్రమాద గర్భిణీలను ప్రత్యేకంగా పర్యవేక్షించాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు పెరిగేలా గర్భిణీలు, వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలని తెలిపారు. పూర్తి వ్యాక్సినేషన్ లక్ష్యాన్ని సాధించాలని, హెచ్‌పీవీ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేసి అర్హులైన బాలికలకు టీకాలు అందేలా చూడాలని సూచించారు. క్షయవ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా లక్షణాలు ఉన్న ప్రతి వ్యక్తి నుండి కఫ నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించాలని, రోగులను త్వరగా గుర్తించి చికిత్స పూర్తయ్యే వరకు పర్యవేక్షించాలని తెలిపారు. నిక్షయ్ పోషణ్, యాక్టివ్ కేస్ ఫైండింగ్, కాంటాక్ట్ ట్రేసింగ్ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.కుష్ఠు వ్యాధి నిర్మూలనలో భాగంగా చర్మంపై తెల్లటి లేదా స్పర్శ తెలియని మచ్చలు, నరాల సమస్యలు వంటి లక్షణాలు ఉన్న వారిని ముందుగానే గుర్తించి పరీక్షలు నిర్వహించాలని, బాధితులకు ఉచిత చికిత్స అందించాలని, సమాజంలో అపోహలు, వివక్షను తొలగించేలా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.ఆరోగ్య విద్యా బోధకులు గ్రామాలు, పాఠశాలలు, కళాశాలలు, ప్రజా సమావేశాల్లో ఆరోగ్య చైతన్య కార్యక్రమాలు నిర్వహించి మూఢనమ్మకాలు, దుష్ప్రచారాలు, పుకార్లు, చేతబడులు వంటి అవాస్తవ నమ్మకాల వల్ల కలిగే ఆరోగ్య నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, అనారోగ్య సమస్యలు వచ్చినప్పుడు శాస్త్రీయ వైద్యం మాత్రమే సరైన మార్గమనే విశ్వాసాన్ని పెంపొందించాలని సూచించారు.పిల్లల ఆరోగ్యం, పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రత, టీకాల ప్రాధాన్యత, రక్తహీనత నివారణ, యుక్తవయస్సు ఆరోగ్యం, మహిళల ఆరోగ్యం, కుటుంబ నియంత్రణ, జనరిక్ మందుల వినియోగంపై నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.జాతీయ అంధత్వ నియంత్రణ కార్యక్రమంలో భాగంగా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, కళాశాలల్లో కంటి పరీక్షల శిబిరాలు నిర్వహించి దృష్టి సమస్యలు ఉన్న విద్యార్థులను గుర్తించాలని, అవసరమైన వారికి కళ్లద్దాలు అందించి, చికిత్స అవసరమైతే సంబంధిత ఆసుపత్రులకు రిఫర్ చేయాలని సూచించారు. వృద్ధులు, మధుమేహ రోగులు తదితర ప్రమాద వర్గాలకు కూడా కంటి పరీక్షలు నిర్వహించాలని తెలిపారు.ఈ-ఔషధి ద్వారా మందుల నిల్వలను సక్రమంగా నిర్వహించాలని, ఈ-ఆరోగ్యం పోర్టల్‌లో అన్ని సేవలు, నివేదికలను సకాలంలో నమోదు చేయాలని ఆదేశించారు.సికిల్ సెల్ అనీమియా నియంత్రణ కార్యక్రమంపై కూడా సమీక్ష నిర్వహించి, ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ సికిల్ సెల్ స్క్రీనింగ్ నిర్వహించాలని, పాజిటివ్‌గా గుర్తించిన వారికి నిర్ధారణ పరీక్షలు, జన్యు సలహా, క్రమానుగత వైద్య పర్యవేక్షణ, అవసరమైన చికిత్స అందించాలని సూచించారు.అనంతరం జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రుల వైద్యులతో వ్యాక్సిన్ రివెంటబుల్ డిసీజెస్ సర్వైలెన్స్‌పై ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య అధికారి మాట్లాడుతూ పోలియో కంఠసర్పి కోరింత దగ్గు, నియోనేటల్ ధనుర్వాతం, సంబంధిత అనుమానిత లేదా నిర్ధారిత కేసుల సమాచారాన్ని వెంటనే జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయానికి నివేదించాలని సూచించారు. అదేవిధంగా అనుమానిత పోలియో కేసులు గుర్తించిన వెంటనే సమాచారాన్ని అందజేయాలని ఆదేశించారు. జిల్లాలోని స్పెషలిస్ట్ వైద్యులతో ప్రత్యేక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు జిల్లా కార్యాలయానికి అందించాలని తెలిపారు.డెంగ్యూ నిర్ధారణ విషయంలో ర్యాపిడ్ టెస్ట్‌లో పాజిటివ్ రావడం లేదా ప్లేట్‌లెట్స్ తగ్గడం మాత్రమే ఆధారంగా డెంగ్యూ అని నిర్ధారించకూడదని స్పష్టం చేశారు. అలాంటి రోగులను ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేసి, నిర్ధారణ పరీక్షల ద్వారా డెంగ్యూ నిర్ధారితమైన తర్వాత మాత్రమే కేసుగా నమోదు చేసి చికిత్స అందించాలని సూచించారు.ఫీల్డ్ స్థాయిలో ప్రతి ఆరోగ్య పర్యవేక్షకుడు క్రమం తప్పకుండా పర్యటిస్తూ ఆరోగ్య కార్యకర్తలకు మార్గదర్శకత్వం అందించాలని, అన్ని సూచికల్లో జిల్లా రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని డా. తుకారాం రాథోడ్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అదనపు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. సైదులు, డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. శ్రీధర్, జిల్లా ప్రోగ్రాం అధికారులు డా. ప్రసాద్, డా. ప్రతాప్, డా. దినేష్, డా. రాకేష్, వైద్యాధికారులు, డిప్యూటీ డెమో నాగలక్ష్మి,ఆరోగ్య బోధకులు, ఆరోగ్య పర్యవేక్షకులు, ఇతర ఆరోగ్య సిబ్బంది జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రుల వైద్యులు పాల్గొన్నారు.

## చత్రపతి విగ్రహ నిర్మాణ స్మృతివనానికి 1 లక్ష విరాళం అందజేసిన శ్రీ ఆదిత్య పరశ్రీ

హైదరాబాద్ పల్స్ న్యూస్, నారాయణపేట ప్రతినిధి: చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ నిర్మాణం, స్మృతివన అభివృద్ధి అంబత్రేయ క్షేత్రం వ్యవస్థాపకులు ఆదిత్య పరశ్రీ గారు శుక్రవారం నాడు లక్ష రూపాయల విరాళాన్ని నిర్వాహకులకు అందజేశారు. నేపథ్యంలో అనంతరం పరమపూజ్య శ్రీ ఆదిత్యపారశ్రీ గురువులను చత్రపతి శివాజీ విగ్రహ నిర్మాణ యోజనా సంఘం సభ్యులు ఘనంగా ఆహ్వానించి, శాలువాతో సత్కరించి సన్మానించారు. ప్రాజెక్టు విశేషాలను శ్రద్ధగా ఆలకించిన పరమపూజ్య గురువులు హర్షం వ్యక్తం చేస్తూ, దేశంలోనే ఆదర్శప్రాయమైన స్మృతివనంగా నారాయణపేట రూపుదిద్దుకోవడం అత్యంత గర్వకారణమని పేర్కొన్నారు.

అవసరమైన సహకారాన్ని నిరంతరం అందిస్తాం.. జాతి చైతన్యాన్ని, భారతీయ సంస్కృతి వైభవాన్ని, చరిత్ర స్ఫూర్తిని భావితరాలకు చేరవేసే ఈ మహత్తర యజ్ఞానికి తమ పీఠం సంపూర్ణ ఆశీస్సులు, సహకారం ఎల్లప్పుడూ ఉంటాయని ప్రకటించారు. ఈ సందర్భంగా తొలి విడతగా తమ పీఠం తరఫున రూ. 1,00,000 (ఒక లక్ష రూపాయలు) ఆర్థిక సహాయాన్ని అందజేశారు. భవిష్యత్తులో కూడా ఈ చారిత్రాత్మక కార్యక్రమానికి అన్ని విధాలుగా అండదండలుగా నిలిచి, అవసరమైన సహకారాన్ని నిరంతరం అందిస్తామని గురువులు భరోసా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యోజనా సంఘం గౌరవాధ్యక్షులు కురుమన్న, అధ్యక్షులు మహేష్, ప్రధాన కార్యదర్శి శ్రీపాద, ఉపాధ్యక్షులు వెంకటేష్



గౌడ్, పల్లా రఘు, మహాదేవ్, నవీన్, గోపీకృష్ణ, జిత్తూ పటేల్, అప్పి, బాలరాజు, భారతీయ జనతా పార్టీ లీగల్ సెల్ సీనియర్ నాయకులు రఘువీర్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## "బెదిరింపులతో ఏమీ మార్చలేరు"- పాక్ కు భారత్ ఘాటు కౌంటర్..!

హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 03 : కశ్మీర్లో పహల్గాం ఉగ్రదాడుల తర్వాత పాకిస్తాన్ కు నిలిపేసిన సింధు జలాల ఒప్పందాన్ని అమలు చేయాల్సిందేనంటూ ఈ మధ్య వరుసగా పొరుగు దేశం బెదిరింపులకు దిగుతోంది. సింధు జలాలు వదలకపోతే యుద్ధానికి సైతం సిద్ధమంటూ ప్రకటనలు చేస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్రం ఇవాళ మరోసారి పాకిస్తాన్ కు ఘాటు కౌంటర్ ఇచ్చింది. సింధు జలాల విషయంలో పొరుగుదేశం బెదిరింపులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ విదేశాంగశాఖ ఓ ప్రకటన చేసింది.సింధు జలాల ఒప్పందం పై పాకిస్థాన్ దూకుడు వైఖరి ఆపేంతవరకూ, సరిహద్దు ఉగ్రవాదానికి మద్దతు ఇవ్వడం ఆపేంత వరకు దీన్ని నిలిపివేయాలన్న భారతదేశ నిర్ణయంపై ఎలాంటి ప్రభావం చూపదని భారత్ ఇవాళ తేల్చిచెప్పేసింది. సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేయాలని భారత్ నిర్ణయించినప్పటి నుంచీ సరిహద్దు నదులను పంచుకునే దేశాలకు భారత్ నిర్ణయం ఒక ప్రమాదకరమైన ఉదాహరణగా నిలుస్తుందని పాకిస్థాన్ అంతర్జాతీయ సమాజానికి అబద్ధాలు చెబుతూ వస్తోంది.ఈ నేపథ్యంలో భారత్ ఇవాళ స్పందించింది. సరిహద్దు ఉగ్రవాదానికి మద్దతు ఇవ్వడం ఆపేంత వరకు ఏమీ మారదని విదేశాంగ మంత్రిత్వ శాఖ ఇవాళ పాకిస్థాన్‌కు గుర్తుచేసింది. సింధు జలాల ఒప్పందంపై భారతదేశ వైఖరి స్థిరంగా ఉందని, సరిహద్దు ఉగ్రవాదానికి పాకిస్థాన్ నిరంతరం మద్దతు ఇస్తున్నందుకు ప్రతిస్పందనగా సింధు జలాల ఒప్పందం నిలిపేసినట్లు తెలిపింది. పాకిస్థాన్ సరిహద్దు ఉగ్రవాదానికి తన మద్దతును విశ్వసనీయంగా, తిరుగులేని విధంగా విరమించుకోవాలని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు. సింధు జలాల ఒప్పందం విషయంలో అంతర్జాతీయ మద్దతు పొందే ప్రయత్నాల్లో భాగంగా, పాకిస్తాన్ ఉప ప్రధాని ఇషాక్ దార్ .. ఇండస్ వాటర్ ట్రిటీ ని నిలిపివేయాలన్న భారతదేశ నిర్ణయాన్ని తమ దేశం తిరస్కరిస్తోందని తెలిపారు. అలాగే ఆ ఒప్పందం చెల్లుబాటులో, కట్టుబడి ఉండేదిగా అమలులో ఉందని గుర్తుచేశారు. కానీ భారత్ ఈ వాదనను ఇవాళ మరోసారి తోసిపుచ్చింది.



# ఆలేరు ప్రభుత్వ ఆసుపత్రిని 50 పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దుతాం : ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు ప్రభుత్వ ఆసుపత్రిని ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేలా 50 పడకల ఆధునిక ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తున్నామని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య తెలిపారు. శుక్రవారం ఆలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ముఖ్య అతిథిగా పాల్గొని ఆసుపత్రి అభివృద్ధి, వైద్య సేవల విస్తరణ, రోగులకు అందుతున్న సౌకర్యాలపై అధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆలేరు పట్టణం గుండా జాతీయ రహదారి (నేషనల్ హైవే) వెళ్లడం వల్ల తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రమాద బాధితులకు అత్యవసర వైద్య సేవలు వెంటనే అందించేందుకు ఆసుపత్రిలో అవసరమైన అన్ని ఆధునిక సౌకర్యాలను కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో రోగుల ప్రాణాలను కాపాడేందుకు ఎక్స్‌రే, స్కానింగ్ యంత్రాలతో పాటు ఇతర అత్యాధునిక వైద్య పరికరాలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామని తెలిపారు. అదేవిధంగా ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది కొరత లేకుండా అవసరమైన పోస్టులను భర్తీ చేయించి, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి మెరుగైన చికిత్స అందే విధంగా అన్ని విభాగాలను బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఆలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో విజయవంతంగా కొనసాగుతున్న డయాలసిస్ సెంటర్‌కు మరో 10 పడకలను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే వెల్లడించారు. దీంతో కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న రోగులకు మరింత సౌకర్యవంతంగా, వేగంగా చికిత్స అందించే అవకాశం కలుగుతుందని చెప్పారు.



ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామీణ ప్రాంత ప్రజలకు సైతం నగర స్థాయి వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఆలేరు ప్రభుత్వ ఆసుపత్రిని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యులు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అక్రమణలకు పాల్పడిన బోర్డు ఏ సభ్యుడైన అనర్హుడే

### బోర్డు సభ్యురాలిగా భానుక నర్మదా కొనసాగేందుకు ఎలాంటి నైతిక హక్కు లేదు

### మీడియా సమావేశంలో క్రిశాంక్ వెల్లడి



సికింద్రాబాద్, జూలై 03,హైదరాబాద్ పల్స్ ప్రతినిధి : సికింద్రాబాద్ పరిధిలోని కంటోన్మెంట్ బోర్డులోని కంటోన్మెంట్స్ చట్టం,2006లోని సెక్షన్ 34 ప్రకారం కంటోన్మెంట్ భూములపై అక్రమ ఆక్రమణలకు పాల్పడిన లేదా వాటికి సహకరించిన ఏ బోర్డు సభ్యుడైనా తన పదవికి అనర్హుడై తొలగించబడాలి అని మీడియా సమావేశంలో క్రిశాంక్ వెల్లడించారు. నామినేటెడ్ బోర్డు సభ్యురాలి భర్త కంటోన్మెంట్ భూమిని ఆక్రమించి గెస్ట్ హౌస్ నిర్మించారు. దానిని ఖాళీ చేయాలని నోటీసులు అందుకున్న నేపథ్యంలో, బోర్డు సభ్యురాలిగా భానుక నర్మదా కొనసాగేందుకు ఎలాంటి నైతిక పరమైన లేదా చట్టపరమైన హక్కు లేదని అగ్రహించారు.

# ‘బుల్డోజర్’ యాక్షన్‌కు రంగం సిద్ధం.. అయోధ్య విరాళాల చోరీ.. యోగి సర్కార్ సీరియస్

హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 03, ఉత్తరప్రదేశ్: అయోధ్య రామమందిర విరాళాల చోరీ కేసు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ ముమ్మరం చేయడంతో నిందితుల విలాసవంతమైన ఇళ్లు, అక్రమంగా ఏర్పాటు చేసిన ప్రైవేట్ విరాళాల పెట్టెలు (డొనేషన్ బాక్సులు) ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. దీనికి తోడు ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్నవారిపై ‘బుల్డోజర్’ యాక్షన్ తీసుకునే దిశగా యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం సాగుతున్నట్లు కనిపిస్తోంది. ఏ క్షణమైన నిందితుల అక్రమ ఆస్తుల కట్టడాలు కుప్పకూలొచ్చన్న ప్రచారం యూపీలో జోరుగా సాగుతోంది.విరాళల చోరి కేసులో నిందితుడిగా ఉన్న లవ్ కుష్ మిశ్రాను బుల్డోజర్లు టార్గెట్ చేసినట్లు తెలుస్తోంది. దొంగిలించిన సొమ్ముతో కొనుగోలు చేసినట్లు ఆరోపణలు ఉన్న అతడి ఆస్తులను అధికారులు పరిశీలిస్తున్నారు. నిందితుడి భార్య పేరు మీద నిర్మాణం జరుగుతున్న ఓ భవనానికి సంబంధించి అయోధ్య అభివృద్ధి అథారిటీ తాజాగా నోటీసులు జారీ చేసింది. వారం రోజుల్లోగా సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. సంతృప్తికరమైన సమాధానం రాకపోతే.. ఆ నిర్మాణాన్ని కూలుస్తామని ఇప్పటికే అథారిటీ హెచ్చరించింది.అలయ విరాళాల దుర్వినియోగం




ఆరోపణలకు సంబంధించి అరెస్టు అయిన 8 మంది నిందితుల్లో లవ్ కుష్ మిశ్రా ఒకరు. దర్యాప్తులో భాగంగా సిట్ అధికారులు.. అతడి ఇంట్లో సోదాలు నిర్వహించగా రూ.14.25 లక్షల నగదు బయటపడింది. దర్యాప్తు వర్గాల సమాచారం ప్రకారం.. మిశ్రాకు షాహదత్ గంజ్ ప్రాంతంలో 1000 చ.అ. స్థలంలో విలాసవంతమైన బహుళ అంతస్తు ఇల్లు ఉంది. ఈ ఆస్తి మట్నొత్తం విలువ రూ.1.5 కోట్లుగా అధికారులు అంచనా వేశారు. నెలకు రూ.20 వేల జీతం తీసుకునే మిశ్రాకు ఈ స్థాయిలో ఆస్తులు, డబ్బు ఎలా వచ్చిందన్న దానిపై అధికారులు ఆరా తీస్తున్నారు.పోలీసుల వర్గాల ప్రకారం.. ఈ విశాలమైన ఇంటి కోసం మిశ్రా రూ.80-90 లక్షలు ఖర్చు చేశాడు. దాదాపుగా నిర్మాణం పూర్తైన ఈ 3 అంతస్తు భవనంలో విశాలమైన వంటగది, పడక గదులు, లిఫ్ట్ కోసం ప్రత్యేక స్థలంను ఏర్పాటు చేశారు. ఆలయ విరాళాల నుండి దొంగిలించిన డబ్బుతోనే ఈ ఆస్తికి నిధులు సమకూర్చారా? లేదా? అన్న కోణంలో దర్యాప్తు అధికారులు పరిశీలిస్తున్నారు. ఒకవేళ ఆ డబ్బుతోనే కట్టిందని తేలితే.. అయోధ్య అభివృద్ధి అథారిటీ కఠినమైన చర్యలు తీసుకోవడం ఖాయంగా కనిపిస్తోంది.ఇదిలా ఉంటే విరాళాల చోరీకి సంబంధించి 8 మంది నిందితుల నుంచి భారీ మట్నొత్తంలో డబ్బును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రూ.80.92 నగదుతో పాటు, 1,121 డాలర్లను సీజ్ చేశారు. అంతేకాకుండా విరాళంగా ఇచ్చినట్లు భావిస్తున్న బంగారం, వెండి ఆభరణాలను సైతం అధికారులు వారి వద్ద గుర్తించారు. నిందితులైన మనీశ్ యాదవ్ నుంచి రూ.2 లక్షలు, కరుణేష్ పాండే నుంచి రూ.18.07 లక్షల, లవకుష్ మిశ్రా నుంచి రూ.14.25 లక్షలు, అనుకల్ప్ మిశ్రా నుంచి రూ.16.82 లక్షలు, రమాశంకర్ నుంచి రూ.7.32 లక్షలు, టి. అవినాష్ నుంచి రూ.20.39 లక్షలు, అవినాష్ శుక్లా నుంచి రూ.1 లక్ష చొప్పున స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వివరించారు.

# రైతుల అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం - ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

### రైతులకు సబ్సిడీపై పత్తి విత్తనాలను పంపిణీ చేసిన - ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా, ఆలేరు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య రైతులకు సబ్సిడీపై పత్తి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ, రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. రైతులపై సాగు భారం తగ్గించడంతో పాటు అధిక దిగుబడులు సాధించేలా నాణ్యమైన విత్తనాలను సబ్సిడీపై అందజేస్తున్నట్లు తెలిపారు. రైతులు ప్రభుత్వ సూచించిన నాణ్యమైన విత్తనాలనే వినియోగించి శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టి మంచి దిగుబడులు సాధించాలని సూచించారు. వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, సాగునీటి సౌకర్యాలు, వ్యవసాయ సలహాలు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అన్నారు. రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సబ్సిడీపై పత్తి విత్తనాలు పొందిన రైతులు రాష్ట్ర ప్రభుత్వం, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, రైతులు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మెతుకు పెంటప్ప సేవలు మరువలేనివి...

### రాష్ట్ర రాజకీయ వ్యవహార కమిటీ చైర్మన్ వాసాల రమేష్

హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 03, తెలంగాణ బ్యూరో : కరీంనగర్ పద్మశాలి జిల్లా చేనేత సహకార సంఘం వ్యవస్థాపకుడు, స్వాతంత్ర సమరయోధుడు మెతుకు పెంటప్ప పద్మశాలి సమాజానికి చేసిన సేవలు మరువలేనివని తెలంగాణ పద్మశాలి సంఘం రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ వాసాల రమేష్ అన్నారు. కరీంనగర్ లో పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు మెతుకు సత్యం నివాస ప్రాంగణంలో మెతుకు పెంటప్ప వర్ధంతి సభను శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వాసాల రమేష్ హాజరై మాట్లాడుతూ, పద్మశాలి సంఘం బలోపేతం కోసం జిల్లాలో మొట్ట మొదటి సారిగా చేనేత కార్మికుల ఉపాధి కోసం చేనేత సహకార సంఘాన్ని కరీంనగర్లో ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర పోషించాడని అన్నారు. కరీంనగర్ లోని నిరుపేద పద్మశాలి కుటుంబాల కోసం పద్మనగర్, మార్కండేయ కాలనీ ఏర్పాటు చేసరన్నారు. పద్మశాలి కుటుంబాల పేద విద్యార్థులు విద్య అభ్యసించేందుకు గాను కరీంనగర్ లో పద్మశాలి సంక్షేమ ట్రస్ట్ లో కీలకపాత్ర పోషించాడని అన్నారు. చేనేత కార్మికుల నివేషణ స్థలాల కోసం కృషి చేస్తాడని కొనియాడారు వీరి ఆశయ సాధన కోసం పద్మశాలీలందరం ఐక్యతతో ముందుకు వెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మెతుకు సత్యం, ఉపాధ్యక్షులు స్వర్గం నర్సయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి వోడ్నాల రవీందర్



ప్రచార కార్యదర్శి మార్త ప్రకాష్, జిల్లా నాయకులు వేముల చంద్రశేఖర్, మెతుకు వంశీకృష్ణ, మెతుకు కృష్ణ చైతన్య, మెతుకు రఘువీర్, మెతుకు హరీష్ రాగ్, మెతుకు రిషి, గర్దాస్ సతీష్, అరకాల నాగేందర్ తదితరులున్నారు.

# కేటీఆర్‌ను కలిసిన మోత్కుపల్లి బాలకృష్ణ

హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఆలేరు నియోజకవర్గ బీఆర్ఎస్ సెక్రటరీ జనరల్ మోత్కుపల్లి బాలకృష్ణ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పార్టీ పరిస్థితులు, సంస్థాగత బలోపేతం, రానున్న కార్యక్రమాల విజయవంతానికి కృషి చేయాలని కేటీఆర్ సూచించారని తెలిపారు.పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని మోత్కుపల్లి బాలకృష్ణ తెలిపారు.




విలేకరులు కావలెను
హైదరాబాద్ పల్స్
జాతీయ తెలుగు దినపత్రిక
“ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం” అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాద్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్
- Dr. RAHUL KUMAR 9989834020
- K. Naveen Kumar 94406 53413
www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad

# పోక్సో కేసు.. మదర్సా టీచర్‌కు 20 ఏళ్ల జైలు శిక్ష



హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 03, బాలాపూర్ :
ఓ 11 ఏళ్ల బాలుడిని లైంగిక వేధింపులకు గురి చేసిన మదర్సా టీచర్‌కు ప్రత్యేక కోర్టు 20 ఏళ్ల జైలు శిక్ష విధించింది. శిక్షతో పాటు రూ. 10 వేలు జరిమానా విధించింది.లివివరాల్లోకి వెళ్తే..లి బాలాపూర్ పరిధిలో మదర్సా సెంటర్‌లో సయిూద్ నదీమ్(22) అనే వ్యక్తి టీచర్‌గా పని చేస్తున్నాడు. అయితే అక్కడ చదువుకుంటున్న 11 ఏళ్ల బాలుడిపై 2022 మార్చి నెలలో నదీమ్ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. బాలుడిని లైంగికంగా వేధించాడు. ఈ విషయం బయటకు చెబితే చంపేస్తానని బాలుడిని టీచర్ బెదిరింపులకు గురి చేశాడు. టీచర్ వేధింపులు తాళలేక బాధిత బాలుడు జరిగిన ఘోరాన్ని కుటుంబ సభ్యులకు తెలిపాడు. దీంతో బాలాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి చాంద్రయణగుట్ట పీఎస్‌కు బదిలీ చేశారు. అక్కడ ఛార్జీషీటు నమోదు చేసి తదనంతరం బండ్లగూడ పీఎస్‌కు కేసును బదిలీ చేశారు. మొత్తానికి ఈ కేసులో వాదనలు కొనసాగించిన ప్రత్యేక కోర్టు నదీమ్‌కు 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ. 10 వేలు జరిమానా విధించింది.

# చిన్న కందుకూరు స్టేజ్ వద్ద నూతన బస్టాండ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం చిన్న కందుకూరు స్టేజ్ వద్ద నూతనంగా నిర్మించిన బస్టాండ్‌ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఘనంగా ప్రారంభించారు. గ్రామ ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, యువకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ బస్టాండ్‌ను దివంగత శ్రీమతి గుంటుకు యశోధమ్మ - యాదగిరి రెడ్డి ల జ్ఞాపకార్థం జనగాం ఉపేందర్ రెడ్డి స్వంత నిధులతో నిర్మించి సమాజానికి అందించడం అభినందనీయమని బీర్ల ఐలయ్య కొనియాడారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రయాణికులు ఎండ, వర్షాలకు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు బస్టాండ్‌లు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి గ్రామం అభివృద్ధి చెందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. అలాగే దాతృత్వంతో ముందుకు వచ్చి ప్రజలకు ఉపయోగపడే నిర్మాణాన్ని అందించిన జనగాం ఉపేందర్ రెడ్డి ని ప్రత్యేకంగా అభినందించారు. దివంగత యశోధమ్మ -- యాదగిరి రెడ్డి ల స్మృతిని చిరస్థాయిగా నిలిపే విధంగా నిర్మించిన ఈ బస్టాండ్ గ్రామ ప్రజలకు ఎన్నో సంవత్సరాల పాటు సేవలందిస్తుందని అన్నారు. ప్రజలు ప్రభుత్వ ఆస్తులను, సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా నిర్మించిన వసతులను సంరక్షించుకోవాలని, పరిశుభ్రంగా ఉంచాలని బీర్ల ఐలయ్య పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, వివిధ పార్టీల నాయకులు, అధికారులు, దాత కుటుంబ సభ్యులు, మహిళలు, యువకులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కొరటికల్ నుండి ఉప్పల్ వరకు నూతన ఆర్టీసీ బస్సు సర్వీస్ ప్రారంభం...

## ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

## స్వయంగా ఆర్టిసి బస్సును నడుపుతూ బస్ సర్వీస్ ప్రారంభోత్సవం చేసిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య





హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు మండలం కొరటికల్ గ్రామంలో నూతన ఆర్టీసీ బస్సు సర్వీసును తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య శుక్రవారం ప్రారంభించారు. గ్రామ ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు, మహిళల చిరకాల కోరిక మేరకు కొరటికల్ గ్రామం నుండి ఉప్పల్ వరకు ఈ నూతన బస్సు సర్వీసును అందుబాటులోకి తీసుకురావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్వయంగా బీర్ల ఐలయ్య బస్సు నడుపుతూ బస్సు సర్వీస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు కొరటికల్ నుండి ఉప్పల్ వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని కల్పించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ బస్సు సర్వీసు ద్వారా ప్రతిరోజూ ప్రయాణించే విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, మహిళలు, వృద్ధులు ఎంతో ప్రయోజనం పొందుతారని తెలిపారు. ప్రజా పాలన ప్రభుత్వంలో ప్రజల అవసరాలకే ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్న ఆయన, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో ఆలేరు నియోజకవర్గంలోని ప్రజలకు మెరుగైన ఆర్టీసీ సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని అన్నారు. ప్రజలకు అవసరమైన గ్రామీణ రహదారులపై కొత్త బస్సు సర్వీసులను ప్రారంభించడం, ఇప్పటికే ఉన్న సర్వీసులను బలోపేతం చేయడం ద్వారా విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, గ్రామీణ ప్రజలకు మరింత మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని వివరించారు. గతంలో నష్టాల్లో ఉన్న తెలంగాణ ఆర్టీసీని ప్రజా పాలన ప్రభుత్వం సమర్థవంతమైన నిర్ణయాలతో క్రమంగా లాభాల బాట పట్టించిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అదే సమయంలో రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యాన్ని అమలు చేయడం ద్వారా లక్షలాది మంది మహిళలకు ఆర్థిక భారం తగ్గిందని, ఇది ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందనడానికి నిదర్శనమని అన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా అమలు చేస్తూ ఆలేరు నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఆర్టీసీ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, మహిళలు, విద్యార్థులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో

# కామ్రేడ్ అరుణోదయ నాగన్నకు నివాళి




హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : ప్రజా పాటల పెద్దన్న, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర గౌరవ అధ్యక్షులు, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు కామ్రేడ్ అరుణోదయ నాగన్న మరణించడం తీవ్ర విషాదకరమని అరుణోదయ యాదాద్రి జిల్లా అధ్యక్షులు కుమారస్వామి, కార్యదర్శి ఎలగందుల సిద్ధులు అన్నారు. అరుణోదయ నాగన్నకు అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీల ఆధ్వర్యంలో సంతాపం తెలియజేసారు. ఈ సందర్భంగా కుమారస్వామి, సిద్ధులు మాట్లాడుతూ, కామ్రేడ్ అరుణోదయ నాగన్న జీవితమంతా ప్రజల కోసమే పాట పాడిన గొప్ప ప్రజా కళాకారుడని అన్నారు. కళను వినోదం కోసం కాకుండా ప్రజల విముక్తి కోసం ఒక పోరాట ఆయుధంగా మలచిన అరుదైన సాంస్కృతిక యోధుడని కొనియాడారు. ప్రజల పక్షాన నిలబడిన ఆయన ఎన్నో దశాబ్దాల పాటు రైతులు, కూలీలు, విద్యార్థులు, యువత, ఆదివాసీలు, దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను తన గళం ద్వారా ప్రజల ముందుకు తీసుకెళ్లారని తెలిపారు. అధికారాలు, పదవులు, డబ్బు ఆశలకు ఎప్పుడూ లొంగకుండా తన చివరి శ్వాస వరకు ప్రజల పక్షానే నిలబడ్డారని అన్నారు. ప్రజా ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నందుకు ఆయనపై అనేక తప్పుడు కేసులు బనాయించారని, ఎన్నో నిర్బంధాలు, అరెస్టులు, పోలీసుల వేధింపులను ఎదుర్కొన్నప్పటికీ ఏనాడూ తన ఆశయాలను విడిచిపెట్టలేదని, ఎన్ని కష్టాలు ఎదురైనా ప్రజా సంస్కృతిని, ప్రజా ఉద్యమాలను వీడకుండా తన గళాన్ని అణగారిన ప్రజల కోసం అంకితం చేశారని అన్నారు. కామ్రేడ్ నాగన్న మరణం ప్రజా సాంస్కృతిక ఉద్యమానికి, ప్రజాస్వామ్య ఉద్యమాలకు తీరని లోటని పేర్కొన్న ఆయన, నాగన్న చూపిన ఆశయ మార్గంలో ముందుకు సాగుతూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం సాంస్కృతిక ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో అరుణోదయ జిల్లా కార్యవర్గ సభ్యులు పద్మ సుదర్శన్, ఆర్.ఉదయ్, సిద్దేశ్వర్, నాయకులు ఆర్.జనార్దన్, కల్లెపు అడివయ్య, బేజాడి కుమార్, ఆర్.సీత, తమ్మడి అంజయ్య, దార భాస్కర్, సుంచు రాములు, శ్రీశైలం, కుర్రి సత్యనారాయణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

# వృత్తిలో మృతి చెందిన గీత కార్మికుడి కుటుంబానికి కుట్టు మిషన్ అందజేత

## కౌండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (కానా) అర్థిక సహకారంతో కుట్టు మిషన్ పంపిణి

హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలం బేగంపేట గ్రామానికి చెందిన గీత కార్మికుడు తులసి అశోక్ గౌడ్ ఇటీవల ప్రమాదవశాత్తు తాటి చెట్లు ఎక్కి కల్లు తీయుచుండగా ప్రమాదవశాత్తు తాటిచెట్టు పై నుండి పడి తీవ్రగాయాలతో చికిత్స పొందుతూ మృతి చెందడం జరిగింది. ఇతనికి ఇద్దరు చిన్న పిల్లలు ఇతని పైనే కుటుంబం ఆధారపడి ఉన్నందున అట్టి కుటుంబానికి కుటుంబ పోషణ నిమిత్తం ఆర్థిక సహకారం అందించాలని కౌండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా సంస్థ ని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బొలగానీ జయరాములు చేసిన విజ్ఞప్తి మేరకు కౌండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా సంస్థ ప్రతినిధి నాతి గణేష్. బాల్న రామచంద్రుడు ద్వారా ఈరోజు వారి గ్రామంలోని వారి ఇంటి వద్ద కుటుంబ సభ్యుల సమక్షంలో కుట్టు మిషన్ ను గీత కార్మికుడు తులసి అశోక్ గౌడ్ భార్య తులసి లక్ష్మికి కేజీ కేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జయరాములు . స్థానిక గీత సొసైటీ అధ్యక్షులు బాహుపేట వెంకటేష్ గౌడు ల ఆధ్వర్యంలో అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా జయరాములు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో వృత్తిలో గాయపడిన మరణించిన కుటుంబాలకు ప్రభుత్వపరంగా తాడి కార్పొరేషన్ నుండి తక్షణ సాయం నిలిపివేసిన క్రమంలో కౌండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా సంస్థ ద్వారా వారి కుటుంబాలకు ఆర్థిక సహకారం చేస్తూ భరోసా కల్పిస్తున్నందుకు కల్లు గీత కార్మిక సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ తరఫున గీత కార్మికుల తరఫున కుటుంబ సభ్యుల తరఫున కౌండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా సంస్థకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమలో కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు నేమిలే మహేందర్. మండల అధ్యక్షులు పాండవుల లక్ష్మణ్ మండల ప్రధాన కార్యదర్శి బత్తిని సత్యనారాయణ మాజీ ఎంపీపీ గోపగాని బాలమణి యాదయ్య . మాజీ జెడ్పిటిసి జిల్లా బిక్షపతి. పాముకుంట సర్పంచ్ రంగ నరేష్. రాజపేట ఉప సర్పంచ్ నమిల కేదారి. తోట సత్తయ్య జల్లా రమేష్. ప్యాట మల్లేష్. కిష్టయ్య బాల నరసయ్య వెంకటయ్య కిషోర్ బాలరాజు తదితరులు పాల్గొన్నారు



# బాలాజీ పవర్ లూమ్స్ సంఘం అధ్యక్షులుగా బూరెల స్వామి ఏకగ్రీవం....

హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలం రఘునాథపురం గ్రామంలో బాలాజీ పవర్ లూమ్స్ వివర్స్ కో-ఆపరేటివ్ అండ్ సేల్స్ సొసైటీ లిమిటెడ్, ఎన్నికలు శుక్రవారం రోజున ఎన్నికల అధికారి మీర్ ఇబ్రహీం అలీ నిర్వహించారు, అధ్యక్షులుగా బూరెల స్వామి, ఉపాధ్యక్షులుగా బొద్దుల వెంకటేశం, సెక్రటరీగా సామల భాస్కర్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు, డైరెక్టర్లుగా బల్ల నరహరి, చేన్న నర్సింహులు, ఎలగందుల ప్రకాష్, సకినాల విష్ణు, గుర్రం సతీష్, బల్ల సుదర్శన్, లు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి మీర్ ఇబ్రహీం అలీ ఈ సందర్భంగా తెలిపారు, ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు బూరెల స్వామి మాట్లాడుతూ, తన ఎన్నికకు సహకరించిన సభ్యులందరికీ పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.





# రజినీకాంత్ 'జైలర్ 2' రిలీజ్ డేట్ ఫిక్స్...

## మరోసారి బాక్సాఫీసును షేక్ చేసేందుకు తలైవా రెడీ!

సూపర్‌స్టార్ రజినీకాంత్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'జైలర్ 2' సినిమా విడుదల తేదీ ఖరారైంది. ఈ చిత్రాన్ని ఈ ఏడాది అక్టోబర్ 15న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురానున్నట్లు నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ గురువారం అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెడుతూ, కొత్త రిలీజ్ డేట్ టీజర్‌ను కూడా విడుదల చేసింది.ఈ టీజర్‌లో విలన్ పాత్రధారి వినాయకన్.. "నన్ను చంపి ప్రశాంతంగా ఉండలేవు. నా వెనుక పెద్ద ప్రపంచం ఉంది జైలర్! ఇది చాలా పెద్ద నెట్‌వర్క్. ఎవరు, ఎప్పుడు, ఎలా వస్తారో కూడా నీకు తెలియదు. నీ జీవితం నరకంగా మారుతుంది" అని హెచ్చరించడం ఉత్కంఠ రేపుతోంది. ఆ తర్వాత రజినీకాంత్ స్టైలిష్‌గా ఎంట్రీ ఇవ్వడం అభిమానులను ఆకట్టుకుంటోంది. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి.గతేడాది విడుదలై బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించిన 'జైలర్' చిత్రానికి ఇది సీక్వెల్ కావడం విశేషం. తొలి భాగం ప్రపంచవ్యాప్తంగా రూ. 650 కోట్లకు పైగా వసూళ్లు సాధించి ఇండస్ట్రీ హిట్‌గా నిలిచింది. దీంతో రెండో భాగంపై అంచనాలు రెట్టింపయ్యాయి. ఈ చిత్రంలో మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్, తమిళ నటుడు విజయ్ సేతుపతి కూడా కీలక పాత్రలు పోషిస్తున్నారు. రమ్యకృష్ణ, మిర్ణా మీనన్ ఇతర ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు.ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే పూర్తయినట్లు ఏప్రిల్‌లోనే చిత్రబృందం ప్రకటించింది. తొలి భాగానికి తన సంగీతంతో ప్రాణం పోసిన అనిరుధ్ రవిచందర్ ఈ సీక్వెల్‌కు కూడా స్వరాలు సమకూరుస్తున్నారు.

# ఫ్రాన్స్‌లో రాజమౌళికి అరుదైన గౌరవం... 'వాల్ ఆఫ్ ఫిల్మ్‌మేకర్స్'పై జక్కన్న పేరు




ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళికి అంతర్జాతీయ స్థాయిలో మరో అరుదైన గౌరవం దక్కింది. చలనచిత్ర రంగానికి పురిటిగడ్డగా భావించే ఫ్రాన్స్‌లోని లయోన్‌లో ఉన్న ప్రతిష్ఠాత్మక 'ఇన్‌స్టిట్యూట్ లుమియర్' ఆయన్ను ఘనంగా సత్కరించింది. అక్కడి ప్రఖ్యాత 'వాల్ ఆఫ్ ఫిల్మ్‌మేకర్స్' పై రాజమౌళి పేరుతో శాశ్వత స్మారక ఫలకాన్ని ప్రతిష్టించింది. ఈ అరుదైన గౌరవం ద్వారా మార్టిన్ స్కోర్సెసీ, క్లింట్ ఈస్ట్‌వుడ్, క్వెంటిన్ టరంటినో, ఫ్రాన్సిస్ ఫోర్డ్ కపోలా వంటి ప్రపంచ ప్రఖ్యాత దిగ్గజ దర్శకుల సరసన రాజమౌళి నిలిచారు.జూలై 1, 2 తేదీల్లో జరిగిన ఈ వేడుక అనంతరం రాజమౌళి తన అనుభూతులను సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. "లుమియర్ మ్యూజియంను సందర్శించాను. నా సినిమాలు 'ఈగ', 'ఆర్ఆర్ఆర్' ప్రదర్శితమవుతున్న స్క్రీనింగ్ రూమ్‌కు వెళ్ళిన సమయంలో ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ థియరీ ఫ్రెమాక్స్ నన్ను అక్కడి ప్రేక్షకులకు పరిచయం చేసి, ఒక సర్ ప్రైజ్ ఉందని చెప్పారు. నన్ను సినిమా పుట్టిన వీధిలోకి తీసుకెళ్లగా, అక్కడ ప్రపంచ ప్రఖ్యాత దర్శకుల పేర్లతో కూడిన ఫలకాలు కనిపించాయి. ఎరుపు రంగు వస్త్రంతో కప్పి ఉన్న ఒక ఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. దానిపై నా పేరు చూసి ఒక్కసారిగా భావోద్వేగానికి లోనయ్యాను. ఈ అరుదైన గౌరవానికి వినమ్రంగా ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను" అని రాజమౌళి వివరించారు. ఇటీవలే పారిస్‌లోని 'సినీమాథెక్ ఫ్రాన్సైస్' థియేటర్‌లో రాజమౌళి పేరుతో ఒక శాశ్వత సీటును కేటాయించిన సంగతి తెలిసిందే. తాజా గౌరవంతో ఆయన అంతర్జాతీయ ఖ్యాతి మరో మెట్టు ఎక్కింది. జూన్ చివరి వారం నుంచి జూలై మధ్య వరకు ఇన్‌స్టిట్యూట్ లుమియర్ రాజమౌళి చిత్రాలైన 'బాహుబలి', 'ఆర్ఆర్ఆర్' వంటి చిత్రాలతో ప్రత్యేక 'రెట్రోస్పెక్టివ్'ను నిర్వహిస్తోంది.

# SPORTS

## టీ20 ఫార్మాట్‌కు తిరుగులేదు.. అశ్విన్



న్యూఢిల్లీ: క్రికెట్‌లో టీ20 ఫార్మాట్‌కు తిరుగులేదని, వన్డేల భవిష్యత్తు ఎలా ఉంటుందో మాత్రం చెప్పలేమని భారత దిగ్గజ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ అభిప్రాయపడ్డాడు. క్రికెట్‌ను విశ్వవ్యాప్తం చేసేందుకు టీ20 ఫార్మాట్ ఒక్కటే సరైన మార్గమన్నాడు. ఆగస్టులో మొదలయ్యే యూరోపియన్ టీ20 ప్రీమియర్ లీగ్ (ఈపీటీఎల్)లో డబ్లిన్ గార్డియన్స్ జట్టుకు అశ్విన్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2028 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌లో క్రికెట్ రీఎంట్రీ ఇస్తున్న నేపథ్యంలో ఈ ఆటను గ్లోబల్ స్పోర్ట్‌గా మార్చేందకు ఈపీటీఎల్ కూడా దోహదం చేస్తుందన్నాడు.

## శ్రీలంక-ఏ 288/5

గాలె: భారత్-ఏ జట్టుతో రెండో అనధికార టెస్టును శ్రీలంక-ఏ సాధికారంగా ప్రారంభించింది. గురువారం మొదలైన ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లంక తొలి రోజు చివరకు 85 ఓవర్లలో 288/5 స్కోరు చేసింది. కెప్టెన్ సహాన్ అరాచిగే (83 బ్యాటింగ్) ఇన్నింగ్స్‌ను ముందుండి నడిపించాడు. నువానిడు ఫెర్నాండో (44), అంజల బండారా (42) సత్తా చాటగా.. ఓపెనర్లు పవంత వీరసింఘే (39), సోహన్ దిలివేర (28), అషేన్ బండారా (34) ఫర్వాలేనిపించారు. సహాన్‌తో పాటు చమిక గుణశేఖర (6 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. భారత బౌలర్లలో సారాంశ్ జైన్, యశ్ ఠాకూర్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు.



# మూడో రౌండ్‌కు స్వియాటెక్, జొకో



లండన్: డిఫెండింగ్ చాంపియన్ ఇగా స్వియాటెక్ వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో దూసుకెళ్తోంది. ప్రపంచ మాజీ నంబర్ వన్ కరోలినా ప్లిస్కోవాకు చెక్ పెట్టి మూడో రౌండ్‌లో అడుగు పెట్టింది. గురువారం రాత్రి జరిగిన రెండో రౌండ్ పోరులో మూడో సీడ్ పోలాండ్ స్టార్ 6-1, 6-3తో ప్లిస్కోవా (చెక్ రిపబ్లిక్)ను వరుస సెట్లలో చిత్తు చేసింది. తొలి రౌండ్‌లో టౌన్‌సెడ్‌పై నెగ్గేందుకు చెమటోడ్చిన స్వియాటెక్ ఈ మ్యాచ్‌లో అద్భుత షాట్లతో విజృంభించింది. తొలి సెట్‌లో వరుసగా నాలుగు గేమ్స్ గెలిచి 4-0తో నిలిచిన తర్వాత వెనుదిరిగి చూడకుండా ప్లిస్కోవా పని పట్టింది.మరో మ్యాచ్‌లో ఆరో సీడ్ అనిసిమోవా (అమెరికా) 6-2, 4-6, 7-6 (10/3)తో తమ దేశానికే చెందిన సోఫియా కెనిన్‌పై పోరాడి గెలిచింది. 12వ సీడ్ మర్టా కోస్త్యుక్ (ఉక్రెయిన్) 6-7 (7/5), 6-3, 6-3తో బ్లింకోవా (రష్యా)ను ఓడించి ముందంజ వేసింది. పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో ఫ్రెంచ్ ఓపెన్ చాంపియన్, రెండో సీడ్ జ్వెరెవ్ (జర్మనీ) 6-1, 6-3, 7-6 (7/3)తో వాలెంటైన్ రోయర్ (ఫ్రాన్స్)పై గెలిచి మూడో రౌండ్ చేరాడు.సెర్బియా లెజెండ్, ఏడో సీడ్ నొవాక్ జొకోవిచ్ 6-3, 6-4, 6-2తో వరుస సెట్లలో సిట్సిపాస్ (గ్రీస్)ను చిత్తు చేశాడు. ఇతర మ్యాచ్‌ల్లో ఆరో సీడ్ టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా) 6-2, 6-2, 7-5 కిప్సన్ (అమెరికా)ను, అలెగ్జాండర్ డిమినార్ (ఆస్ట్రేలియా) 6-3, 6-2, 6-2తో మనారినో (ఫ్రాన్స్)ను ఓడించారు. పురుషుల డబుల్స్‌లో భారత ఆటగాళ్లు శ్రీరామ్ బాలాజీ, అనిరుధ్ చంద్రశేఖర్, యూకీ భాంబీ జోడీల పోరాటం తొలి రౌండ్‌లోనే ముగిసింది.

Edited, Published and Owned by Konadoddi Naveen Kumar and Printed at Srinith Publications Falcon Printing Press #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. And Published from #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. Editor's Konadoddi Naveen Kumar, Dr.Tadhkal Rahul Kumar Reg. No.TEL-TEL/2023/12249. Email.HyderabadPulse23@gmail.com, Web:www.HyderabadPulse.com, Cell: +91-94406 53413, +91-9989834020.